

5

ఖద్దరు వెనుక కష్టాలు..

కార్యకర్తల ఆర్థిక బలోపేతం ఎప్పుడు?

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -119 బుధవారం 14 అక్టోబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## ఎన్నికల కమిషనర్లకు చట్టపరమైన రక్షణ

కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు!

కేంద్రం, ఎన్నికల సంఘం సమాధానాలు ఇవ్వాలని ఆదేశం

తదుపరి విచారణ నవంబర్ 2న జరిగే అవకాశం

2023 చట్టంలోని సెక్షన్ 16ను సవాల్ చేసిన ఏడీఆర్

రక్షణ వల్ల జవాబుదారీతనం తగ్గుతుందని ఏడీఆర్ వాదన

2లో.



## దేశవ్యాప్త ఉద్యమం

ఓట్‌చోరీ వ్యతిరేక నిరసనలను రాష్ట్రాలకూ విస్తరిద్దాం

ఇండి కూటమి భేటీలో నిర్ణయం..

దేశవ్యాప్తంగా 5 రాష్ట్రాల్లో బహిరంగ సభలు

లక్ష్యాన్ని సాధించేదాకా పోరు: రాహుల్..

దసరా తర్వాత హైదరాబాద్‌లో సభ

మీడియాతో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్..

2లో.



## కాంగ్రెస్ కు మళ్లీ ఓటమే

ఢిల్లీలో నిరసనలతో దేశ ప్రజలందరి గొంతుక వినిపించినట్లు కాదు

సర్ వచ్చింది 2024లో..

కాంగ్రెస్ దశాబ్దాలుగా ఓడుతూ వస్తోంది

2029లోనూ ఘోర ఓటమే: అమిత్ షా



**న్యూఢిల్లీ,అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ పార్టీకి గ్రామాల్లో పట్టు లేదని, 2029 ఎన్నికల్లోనూ ఘోర పరాజయం తప్పదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. ఎన్నికల ప్రక్రియలను విమర్శించడం మాని, కాంగ్రెస్ పార్టీ తన వైఫల్యాలపై ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. సర్‌లో అక్రమాలు జరిగాయని, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో.. ఇండియా కూటమి నేతలతో కలసి కొన్ని రోజులుగా రాహుల్ గాంధీ ఢిల్లీలో పెద్ద ఎత్తునమిగతాది 2లో...

# నదుల అనుసంధానమే మన లక్ష్యం

## ఏపీ, తమిళనాడు ముఖ్యమంత్రుల సమావేశం





గోదారి-కావేరి అనుసంధానంతోదక్షిణాది రాష్ట్రాలకు మేలు

తమిళనాడు సీఎం విజయ్‌కు చంద్రబాబు సూచన

ప్రధానితో తాను మాట్లాడుతున్నానని..మీరు కూడా కోరాలని వినతి

ఉండవల్లి నివాసంలో 25 నిమిషాలు భేటీ

6 నెలలకోసారి 2 రాష్ట్రాల సీఎస్‌ల భేటీకి నిర్ణయం

తర్వాత ఉభయులూ కలిసి దసరా ఉత్సవ్‌కు హాజరు

అనుసంధానంపై చర్చించేందుకే వచ్చా

మీ ఆతిథ్యానికి కృతజ్ఞతలు: తమిళనాడు సీఎం

**అమరావతి, అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** గోదావరి–కావేరి నదుల అనుసంధానంతోనే దక్షిణాది రాష్ట్రాలకు మేలు జరుగుతుందని, ఇందుకోసం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు చేతులు కలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ రాష్ట్ర సీఎం జోసెఫ్ విజయ్‌తో అన్నారు. నదుల అనుసంధానం, తమిళనాడు రాజధాని చెన్నై నగరానికి తెలుగుగంగ నుంచి తాగునీటి సరఫరాను మిగతాది 2లో...



## సింగరేణి కార్మికులకు దసరా ధమాకా..

ఒక్కొక్కరికి రూ.1.53 లక్షల వరకు బోనస్!

సింగరేణి పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులకు దసరా బోనస్

కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చెల్లింపు

పర్మినెంట్ కార్మికులకు లాభాల్లో 34 శాతం వాటా

అర్హులైన పర్మినెంట్ కార్మికులకు గరిష్ఠంగా రూ.1,53,913

పండుగకు ముందే ఖాతాల్లో బోనస్ జమ చేయనున్న యాజమాన్యం

**హైదరాబాద్ ,అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** దసరా పండుగ వేళ సింగరేణి కార్మికులకు తీపి కబురు అందింది. సంస్థలో పనిచేస్తున్న శాశ్వత కార్మికులతో పాటు కాంట్రాక్టు వారికీ బోనస్ ప్రకటించారు. కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున చెల్లించనున్నారు. మరోవైపు సంస్థ నికరమిగతాది 2లో...

## ఇది ఉచిత విద్యుత్‌ను నీరుగార్చే కుట్రే

రైతు డిస్కమ్‌పై హరీశ్ రావు ఫైర్..



2లో.

## స్థానిక పోరుకు ఏపీ సిద్ధం

### నేడు షెడ్యూల్ విడుదల

ఏపీలో స్థానిక సమరానికి మోగిన నగారా!

మూడు దశల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు!

తొలి విడతలో మున్సిపల్ ఎన్నికలు

గెజిట్ నోటిఫికేషన్ల తర్వాతే ప్రకటన అంటున్న ఎస్ఈసీ పునేఠా

50 శాతం పరిమితికి లోబడే రిజర్వేషన్లను ఖరారు చేసిన ప్రభుత్వం

బీసీలకు 34 శాతం కోటా పెంపు ఉత్తర్వులను కొట్టివేసిన హైకోర్టు

ప్రభుత్వ పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు



**అమరావతి, అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమమైంది. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) షెడ్యూల్‌ను ఖరారు చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా బుధవారం ఉదయం 11:30 గంటలకు విజయవాడలో మీడియా సమావేశం నిర్వహించి, పూర్తి షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేయనున్నారు. దీంతో రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం నెలకొంది. మొత్తం మూడు దశల్లో ఈ ఎన్నికలు జరగనున్నట్టు తెలుస్తోంది. తొలి విడతలో పట్టణ స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను కూడా బుధవారమే విడుదల చేసే అవకాశాలున్నాయి. మిగతాది 2లో...

## మూసీ పునరుజ్జీవానికి ముందడుగు

టెండర్లు ఆహ్వానించిన ఎంఆర్‌డీసీఎల్ -2 ప్యాకేజీల్లో పనులు చేపట్టేలా చర్యలు

**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** మూసీనది పునరుజ్జీవ ప్రాజెక్టుకు ముందడుగు పడింది. ప్రాజెక్టు మొదటి దశ పనులకు ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) నుంచి క్లియరెన్స్ వచ్చింది. దీంతో.. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో.. మొదటి దశలో 21 కిలోమీటర్ల మేరమిగతాది 2లో...



## ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భేటీ

కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జ్‌ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై సానుకూల స్పందన

**హైదరాబాద్ , అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలోని పలు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై చర్చించగా, కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్‌లోని అత్యంత రద్దీ మార్గాల్లో ఒకటైన ఎల్బీనగర్ నుంచి మిగతాది 2లో...



## విదేశీ శక్తులతో కలిసి కమ్యూనిస్టుల కుట్ర

కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని కిషన్ రెడ్డి ఆరోపణ

వారి ధర్నాల వల్లే ఢిల్లీ మార్కెట్లు దెబ్బతిన్నాయని వ్యాఖ్య

పండుగ సీజన్‌లో చిన్న వ్యాపారులను నష్టపరుస్తున్నారన్న కేంద్రమంత్రి



2లో.

# నదుల అనుసంధానమే మన లక్ష్యం

(మొదటి పేజి తరువాయి)

కోరేందుకు తమ పబ్లిక్ వర్క్స్, క్రీడల మంత్రి ఆధవ్ అర్జున, తమిళనాడు సీఎస్ ఎం.సాయికుమార్, ఉన్నతాధికారులతో కలసి విజయ్ మంగళవారం సాయంత్రం రాజధాని అమరావతికి వచ్చారు. ఉండవల్లి నివాసంలో ఆయనకు చంద్రబాబు, మంత్రులు లోకేశ్, నిమ్మల రామానాయుడు ఎదురేగి ఘన స్వాగతం పలికారు. తర్వాత విజయ్‌కు చంద్రబాబు ప్రత్యేకంగా తేనీటి విందు ఇచ్చారు. ఈ సందర్భంగా గోదావరి–కావేరి అనుసంధానంపై చర్చించారు.

'ఈ నదులను అనుసంధానించాలని ప్రధాని మోదీని నేను కోరుతున్నాను. తమిళనాడు ప్రజల తరఫున మీరూ అభ్యర్థించండి. ఈ విషయంలో రెండు రాష్ట్రాలూ చేతులు కలపాలి. గోదావరి–కావేరి అనుసంధాన పథకంతో దక్షిణాది రాష్ట్రాల నీటి కొరత తీరుతుంది. దీనిని అమలు చేసే సత్తా మోదీకే ఉంది. రాష్ట్రాలు వేరైనా ప్రజా సమస్యలపై ఎప్పుడూ తమిళనాడుతో ఆంధ్రప్రదేశ్ గళం కలుపుతూనే ఉంది. చెన్నైకి తాగునీటి సరఫరా కోసం ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ సమక్షంలో ఏపీ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర సీఎంలు చేసుకున్న ఒప్పందాన్ని గౌరవిస్తాం. చెన్నై దాహార్తి తీర్చడానికి నాటి సీఎంలు ఎన్‌టీఆర్, ఎంజీఆర్ కూడా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ ఒప్పందాలపై గౌరవంతోనే ఎల్‌నినో సమయంలోనూ 4.08 టీఎంసీలను చెన్నైకి ఇచ్చాం' అని చంద్రబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌పై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని.. తాగునీటికే ప్రాధాన్యం ఇస్తున్నామని.. పంటలకు సాగునీరు అందించలేకపోయామని చంద్రబాబు తమిళనాడు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పుడు నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురిస్తే చెన్నై తాగునీటి అవసరాల కోసం నీరు అందించగలుగుతామని తెలిపారు. 'ఈ ఏడాది తీవ్ర కరువు నెలకొన్న పరిస్థితుల్లోనూ కండలేరుకు కృష్ణా జలాలు చేరకున్నా.. చెన్నై తాగునీటికి ప్రాధాన్యమిస్తూ 4.08 టీఎంసీలిచ్చాం' అని గుర్తుచేశారు. అయితే రెండున్నర టీఎంసీలే వచ్చాయని తమిళనాడు సీఎస్ చెప్పారు.

జల వనరుల శాఖ ప్రత్యేక సీఎస్ శశిభూషణ్ కుమార్ జోక్యం చేసుకుని.. 4.08 టీఎంసీలూ ఇచ్చామని ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మరో 2–3 టీఎంసీలు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. చెన్నై తాగునీటి సమస్యపై ఆరు నెలలకోసారి ఇరు రాష్ట్రాల సీఎస్‌లూ సమావేశం కావాలని నిర్ణయించారు. 25 నిమిషాల పాటు సీఎంల భేటీ సాగగా.. ఆద్యంతం విజయ్ మౌనంగా ఉన్నారు. ఆఖర్లో వెళ్తూ వెళ్తూ చెన్నైకి తాగునీరు కోరుతూ చంద్రబాబుకు లేఖ అందజేశారు. ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై తమిళనాడు సీఎం విజయ్.. కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం విజయవాడలో పర్యటించారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన ఆయన, ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు.

చెన్నై నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ఆయన, అక్కడి నుంచి నేరుగా ఇంద్రకీలాద్రికి బయలుదేరారు. ఆలయానికి చేరుకున్న సీఎం విజయ్‌కు అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకోగా, పండితులు వేదాశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలను అందజేశారు. విజయ్ ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి రాష్ట్రానికి రావడంతో విజయవాడ నగరంలో కోలాహలం నెలకొంది. ఆయన రాకను తెలుసుకున్న అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో గన్నవరం విమానాశ్రయానికి తరలివచ్చారు. ఆయన కాన్వాయ్‌ను అనుసరిస్తూ అభిమానులు తమ ఉత్సాహాన్ని చాటుకున్నారు.

# ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజి తరువాయి)

హయత్‌నగర్ వరకు డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి గడ్కరీ ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ కష్టాలు గణనీయంగా తీరనున్నాయి. వీటితో పాటు, కృష్ణా నదిపై నిర్మించతలపెట్టిన ఐకానిక్ కేబుల్ బ్రిడ్జల శంకుస్థాపన ప్రతిపాదనకు కూడా ఆయన సానుకూలత వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాలను కలిపే హైదరాబాద్–అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంపైనా ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఈ ప్రతిపాదనపై కూడా గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ఇదే క్రమంలో, నవంబర్ 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'ఇండియన్ రోడ్' కాంగ్రెస్ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని గడ్కరీని ఆయన ఆహ్వానించారు.

# రైతు డిస్కమ్‌పై హరీశ్ రావు ఫైర్..

**హైదరాబాద్ , అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలో రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కమ్' ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 17పై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను దూరం చేసే కుట్ర అని ఆయన ఆరోపించారు. ఈ జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, ఇతర రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, విద్యుత్ రంగ నిపుణులు, రైతుల అభ్యంతరాలను కాంగ్రెస్ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని హరీశ్ విమర్శించారు. "రైతు డిస్కమ్ ఏర్పాటు జీవో జారీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, దుర్మార్గ వైఖరికి నిదర్శనం. ఉచిత విద్యుత్ సరఫరాకు పాతరేసి, అన్నదాత మెడకు ఉరేసేందుకేనా ఈ కుట్ర?" అని హరీశ్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ జీవో ప్రకారం 30,60,861 వ్యవసాయ కనెక్షన్లు, 512 ఎత్తిపోతల పథకాలతో పాటు ఎవీఓూరాదీ, మిషన్ భగీరథ కనెక్షన్లు కలిపి మొత్తం 30,62,853 కనెక్షన్లను కొత్త డిస్కమ్‌కు బదిలీ చేస్తున్నారని హరీశ్ రావు తెలిపారు. ఇంత పెద్ద వ్యవస్థను కేవలం 2,000 మంది సిబ్బందితో ఎలా నిర్వహిస్తారని ఆయన ప్రశ్నించారు. కొత్త డిస్కమ్‌కు కేవలం 25 శాతం థర్మల్ విద్యుత్‌ను కేటాయించి, 58 శాతం సౌర, మిగిలింది జల విద్యుత్‌పై ఆధారపడటం అవివేకమన్నారు. సౌర విద్యుత్ పగలు మాత్రమే అందుబాటులో ఉంటుందని, జల విద్యుత్ ఏడాదిలో మూడు, నాలుగు నెలలే లభిస్తుందని గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో రైతులకు 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ ఎలా సాధ్యమవుతుందని సందేహం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడే సంస్థపై అప్పులు, బకాయిల భారం మోపడంపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం కొత్త సంస్థలను ఏర్పాటు చేస్తే రైతుల కరెంట్ కష్టాలు తీరవని, వెంటనే జీవో 17ను వెనక్కి తీసుకుని, ఉచిత విద్యుత్ కొనసాగింపుపై రాతపూర్వక హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# దేశవ్యాప్త ఉద్యమం

**ఓట్‌చోరీ వ్యతిరేక నిరసనలను రాష్ట్రాలకూ విస్తరిద్దాం**

**ఇండి కూటమి భేటీలో నిర్ణయం..**

**న్యూఢిల్లీ,అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం తాము చేస్తున్న పోరాటాన్ని.. ఒక తార్కిక ముగింపునకు వచ్చే వరకూ కొనసాగించాలని ఇండి కూటమి నిర్ణయించింది. ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఇప్పటి వరకూ దేశ రాజధానిలో పలు నిరసన ప్రదర్శనలు నిర్వహించిన ఆ కూటమి.. తమ కార్యాచరణ ప్రణాళికను రాష్ట్రాలకు కూడా విస్తరించాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. మంగళవారం ఇక్కడ రాహుల్ గాంధీ నివాసంలో జరిగిన సమావేశంలో.. ఇండి కూటమి నేతలు, విద్యార్థి నాయకులు, పౌర సమాజానికి చెందిన నేతలు పాల్గొని, పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఓట్ చోరీకి వ్యతిరేకంగా సోమవారం ఢిల్లీలో కనీవినీ ఎరుగని రీతిలో పెద్దఎత్తున నిర్వహించిన నిరసన ప్రదర్శన ఘన విజయం సాధించడం పట్ల వారు హర్షం వ్యక్తంచేశారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలను, అర్హులైన ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తున్న విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని నిశ్చయించారు. ఆందోళనలను రాష్ట్రాలకు విస్తరించే ప్రణాళికలో భాగంగా తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల్లో ఇండి కూటమి నేతలతో పెద్ద ఎత్తున బహిరంగ సభలు కూడా నిర్వహించాలని నిర్ణయించింది. అందులో భాగంగా దసరా పండుగ తర్వాత హైదరాబాద్ వేదికగా భారీ మార్చ్, బహిరంగ సభ నిర్వహించనున్నట్టు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సభ నిర్వహణ తేదీ, ఇతర వివరాలను ఇండి కూటమి అగ్రనేతలు త్వరలోనే ఖరారు చేస్తారని చెప్పారు. అయితే.. ఈ నెల 25–26 తేదీల్లో ఆ సభను నిర్వహించే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

# కాంగ్రెస్ కు మళ్లీ ఓటమే

(మొదటి పేజి తరువాయి)

నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతెలిసిందే. దీంతో మంగళవారం అమిత్‌షా ఢిల్లీలో విలేకరులతో మాట్లాడిన సందర్భంగా, రాహుల్ వ్యవహార శైలిపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి గ్రామాల్లో ఉనికే లేదన్నారు. ప్రతిపక్ష నేతలను, కార్యకర్తలను సమీకరించి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు వ్యతిరేకంగా ఢిల్లీలో నిరసనలు నిర్వహించినంత మాత్రాన దేశ ప్రజలందరి గొంతుక వినిపించినట్లు కాదన్నారు. దేశ ప్రజల గొంతుక అన్నది పొలాలు, పల్లెలు, కొండలు, అడవులు, నదీ తీరాల్లోనూ వినిపిస్తుందంటూ.. ఆ ప్రాంతాల్లో కాంగ్రెస్ ఉనికి నామమాత్రమేనని, దాదాపు లేనేలేదన్న విషయాన్ని ఆ పార్టీ అర్థం చేసుకోవాలన్నారు. సర్ 2024లోనే అమల్లోకి వచ్చిందని.. కానీ, కాంగ్రెస్ పార్టీ అంతకుముందు నుంచే వరుసగా ఎన్నికల్లో ఓటమి పాలవుతూ వచ్చిందని గుర్తు చేశారు.

2029 ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు ఘోర పరాజయం తప్పదన్నారు. వరుసగా నాలుగో విడత లోక్‌సభ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోనుందని జోస్యం చెప్పారు. గుజరాత్‌లో తాజాగా జరిగిన మూడు పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ 104కు గాను 90 చోట్ల విజయం సాధించిన అనంతరం అమిత్‌షా ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. గాంధీనగర్‌లో బీజేపీ ఓటు శాతం క్రితం ఎన్నికలతో పోలిస్తే 10 శాతం పెరిగినట్లు అమిత్‌షా చెప్పారు. ఈ ఫలితాలను ప్రధాని మోదీకి లభిస్తున్న నిరంతర ప్రజా మద్దతుకు నిదర్శనంగా పేర్కొన్నారు. 1985 నుంచి గుజరాత్‌లో కాంగ్రెస్ ఒక్క ఎన్నికల్లోనూ గెలవలేదని అమిత్‌షా గుర్తు చేశారు. త్రిపురలోనూ గత 33 ఏళ్లుగా కాంగ్రెస్‌కు ముఖ్యమంత్రి ఎవరూ లేరన్నారు. అలాగే, బెంగాల్లోనూ 54 ఏళ్ల నుంచి ఒక్క ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలవలేదన్న గణాంకాలను షా ఉదహరించారు. ఇక రాహుల్ నిర్వహిస్తున్న 'ఛాత్రోన్‌కీ గూంజ్' (విద్యార్థుల ప్రతిధ్వని) కార్యక్రమాన్ని అబద్ధాల ప్రతిధ్వనిగా అమిత్‌షా అభివర్ణించారు.

# విదేశీ శక్తులతో కలిసి కమ్యూనిస్టుల కుట్ర

**కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని కిషన్ రెడ్డి ఆరోపణ**

**వారి ధర్నాల వల్లే ఢిల్లీ మార్కెట్లు దెబ్బతిన్నాయని వ్యాఖ్య**

**పండుగ సీజన్‌లో చిన్న వ్యాపారులను నష్టపరుస్తున్నారన్న కేంద్రమంత్రి**

**అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):**
దేశంలో అరాచకం సృష్టించేందుకు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలు విదేశీ శక్తులతో కలిసి కుట్ర పన్నుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీలో నిరసనల పేరుతో ఈ పార్టీలు ఉద్దేశపూర్వకంగా దేశ ఆర్థిక వ్యవస్థను, శాంతిభద్రతలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి... కమ్యూనిస్టుల పాత్రపై ప్రత్యేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్, కమ్యూనిస్టులు చేస్తున్న ధర్నాల వల్ల ఢిల్లీ మార్కెట్ పూర్తిగా దెబ్బతింది. దసరా, దీపావళి వంటి పండుగ సీజన్‌లో చిన్న దుకాణదారులు సరుకులు తెచ్చుకోలేని దుస్థితిని కల్పించారు. కుట్రపూరితంగా ఢిల్లీ ప్రజల జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తూ వ్యాపారుల పొట్ట కొడుతున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ తన స్థాయిని మరిచి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

రాహుల్ గాంధీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు ప్రజాస్వామ్య హక్కులను దుర్వినియోగం చేస్తూ దేశ ప్రతిష్టను మంటగలుపుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ, అమిత్ షా, అజిత్ దోవల్‌ను లక్ష్యంగా చేసుకుని బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమకు అనుకూలంగా తీర్పులు రాలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా గద్దె దిగమనడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడంలో తప్పులేదని, కానీ రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసేలా వ్యవహరించడం దారుణమని ఆయన పేర్కొన్నారు.

# స్థానిక పోరుకు సిద్ధమవుతున్న ఏపీ..

(మొదటి పేజి తరువాయి)

రెండో విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, ఆ తర్వాత మూడో విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎస్ఈసీ ప్రణాళిక సిద్ధం చేసినట్టు సమాచారం.

ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని జిల్లాల నుంచి గెజిట్ నోటిఫికేషన్లు ఇప్పటికే ఎన్నికల సంఘానికి చేరాయి. దీంతో షెడ్యూల్ విడుదలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ఉదయం 11.30 గంటలకు విజయవాడ ఎం.జీ. రోడ్డులోని నూతన హెచ్‌ఓడీ భవనంలో ఉన్న రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో కమిషనర్ పునేఠా ఈ వివరాలను మీడియాకు వెల్లడించనున్నారు. ఈ మేరకు ఎస్ఈసీ కార్యదర్శి మీడియాకు ఆహ్వానం పంపారు. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. సంబంధిత ప్రభుత్వ శాఖలు గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేసిన వెంటనే ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా మంగళవారం స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం తమ సంసిద్ధతను తెలియజేసిన తర్వాత ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళతామని ఆయన తెలిపారు. నేడు ఆయన 20 రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఎన్నికల నిర్వహణపై చర్చించారు.

సమావేశం అనంతరం పునేఠా మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికలను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. సున్నితమైన, అత్యంత సున్నితమైన ప్రాంతాలలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. పోటీ చేసే అభ్యర్థులకు తగిన భద్రత కల్పించాలని రాజకీయ పార్టీలు కోరినట్లు ఆయన వెల్లడించారు. అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రాలను సకాలంలో జారీ చేయడంతో సహా పలు కీలక సూచనలను పార్టీల ప్రతినిధులు తమకు అందజేశారని పునేఠా వివరించారు.

# సింగరేణి కార్మికులకు దసరా ధమాకా..

(మొదటి పేజి తరువాయి)



లాభాల్లో 34 శాతం వాటాను పర్మినెంట్ కార్మికులకు పంపిణీ చేయనున్నారు. దీంతో సింగరేణి కార్మికుల ఇళ్లలో పండుగ సందడి నెలకొంది.

సింగరేణి సాధించిన నికర లాభాల్లో 34 శాతాన్ని పర్మినెంట్ కార్మికులకు బోనస్‌గా అందించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు అర్హులైన ప్రతి కార్మికుడికి గరిష్ఠంగా రూ.1,53,913 వరకు అందనుంది. పండుగకు ముందే ఈ మొత్తాన్ని కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు యాజమాన్యం వెల్లడించింది. గతేడాది తరహాలోనే ఈసారి కూడా కాంట్రాక్టు కార్మికులకు బోనస్ అందించనున్నారు. ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున చెల్లించనున్నారు. దీంతో సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల కుటుంబాల్లోనూ దసరా ఆనందం నిండనుంది.

బొగ్గు గనుల్లో రేయింబవళ్లు శ్రమిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడుతున్న కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని యాజమాన్యం పేర్కొంది. పండుగ వేళ బోనస్ ప్రకటనతో కార్మికుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

# ఎన్నికల కమిషనర్లకు చట్టపరమైన రక్షణ

**అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):**
ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్లకు చట్టం ద్వారా కల్పించిన విస్తృత న్యాయపరమైన రక్షణను సవాలు చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఈ రక్షణ రాజ్యాంగంలోని సమానత్వ హక్కు, భావప్రకటన స్వేచ్ఛకు సంబంధించిన నిబంధనలకు విరుద్ధమని 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' (ఏడీఆర్) తన పిటిషన్‌లో పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై స్పందించింది. కేంద్రం, ఎన్నికల సంఘం తమ సమాధానాలను సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 2న చేపట్టే అవకాశం ఉంది.

**అసలు వివాదం ఏంటి?**

2023లో తీసుకొచ్చిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) చట్టంలోని సెక్షన్ 16 ఈ వివాదానికి కేంద్రంగా ఉంది. ఈ నిబంధన ప్రకారం.. ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా లేదా ఎన్నికల కమిషనర్‌గా పనిచేసిన వ్యక్తి, తన అధికారిక విధుల నిర్వహణలో లేదా విధులు నిర్వహిస్తున్నట్లు భావించి చేసిన చర్యలు, మాట్లాడిన మాటలకు సంబంధించి ఆయనపై సివిల్, క్రిమినల్ కేసులను కోర్టులు స్వీకరించకూడదు. ఇప్పటికే కొనసాగుతున్న అలాంటి కేసులను కూడా కొనసాగించకూడదని ఈ సెక్షన్ పేర్కొంటోంది. ఈ రక్షణ విధుల్లో ఉన్నవారికే కాకుండా, గతంలో ఆ పదవుల్లో పనిచేసినవారికీ వర్తిస్తుంది. అయితే, ఈ నిబంధన రాజ్యాంగబద్ధతనే ఏడీఆర్ సవాలు చేసింది.

**ఏడీఆర్ అభ్యంతరాలేంటి?**

సెక్షన్ 16 రాజ్యాంగంలోని ఆర్టికల్ 14లోని సమానత్వ హక్కు, ఆర్టికల్ 19లోని స్వేచ్ఛకు సంబంధించిన హక్కులను ఉల్లంఘిస్తోందని ఏడీఆర్ వాదిస్తోంది. ఎన్నికల కమిషనర్లకు ఇంత విస్తృత రక్షణ కల్పించడం వల్ల వారి చర్యలపై జవాబుదారీతనం తగ్గుతుందని పిటిషన్‌లో పేర్కొంది. అధికార దుర్వినియోగం లేదా అవినీతికి సంబంధించిన ఆరోపణలపై న్యాయపరమైన పరిశీలనకు అడ్డంకులు ఏర్పడే అవకాశం ఉందని అభ్యంతరం వ్యక్తం చేసింది.

**ఎన్నికల సంఘం అధికారాలపైనా మరో పిటిషన్**

ఎన్నికల సంఘం పనితీరు, దాని అధికారాల వినియోగంపై కూడా సుప్రీంకోర్టులో వేర్వేరు పిటిషన్లు విచారణకు వస్తున్నాయి. ప్రస్తుత సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల సంఘానికి చెందిన అధికారాలను వ్యక్తిగతంగా వినియోగించగలరా లేదా ఆ సంస్థ తరఫున ఏకపక్షంగా వ్యవహరించగలరా అనే అంశంపై దాఖలైన మరో పిటిషన్‌పై కూడా అక్టోబర్ 5న ధర్మాసనం కేంద్రానికి, ఎన్నికల సంఘానికి, ముగ్గురు ఎన్నికల కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల నిర్వహణపై పర్యవేక్షణ, ఆదేశాలు, నియంత్రణాధికారాలు ఎన్నికల సంఘం అనే సంస్థకు ఉంటాయని పిటిషనర్ వాదించారు.

# మూసీ పునరుజ్జీవానికి ముందడుగు

(మొదటి పేజి తరువాయి)

అభివృద్ధి పనులు రెండు ప్యాకేజీల్లో చేపట్టేందుకు టెండర్లను పిలిచారు. గురువారం నుంచి టెండర్ డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. టెండర్ దాఖలుకు తుదిగడువు నవంబరు 26. నవంబరు నెలాఖరుకల్లా.. అర్హత కలిగిన సంస్థలను ఎంపిక చేసే అవకాశాలున్నాయి.

కాగా.. రెండు ప్యాకేజీల్లో భాగంగా మూసీనది ప్రక్షాళన, బఫర్ జోన్ సుందరీకరణ పనులను చేపట్టడంతోపాటు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు గల ఈసా నదిపై 9.8కిలోమీటర్ల ప్రాంతాన్ని జోన్ -1ఏ కింద.. అలాగే గండిపేట నుంచి బాపుఘాట్ వరకు గల 11.2 కిలోమీటర్ల మూసీనది ప్రాంతాన్ని జోన్ 1బీ కింద అభివృద్ధి చేయనున్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టును వీ ఆకారంలో చేపట్టనున్నారు. మొదటి దశ పనులకు రూ.7,345 కోట్ల దాకా (ప్యాకేజీ–1 పనులకు రూ.3,232.01 కోట్లు, ప్యాకేజీ–2 పనులకు రూ.4,113.11 కోట్లు) ఖర్చవుతుందని అంచనా.

జోన్ -1ఏ పనుల్లో భాగంగా.. నదిని శుభ్రం చేయడం, వరద నివారణ పనులు, రిటైనింగ్ గోడలు, రివర్ ఎంబ్యాంక్‌మెంట్ల నిర్మాణం, రోడ్లు, బ్రిడ్జిలు, యుటిలిటీ కారిడార్, వర్షపునీటి డ్రైనేజీ, సీడీ పనులు, ట్రంక్ సీవర్ మెయిన్ లైన్లు, రబ్బర్ డ్యామ్స్ పనులు చేపట్టడంతో పాటు ఐదేళ్ల పాటు ఆపరేషనల్ మెయింటెనెన్స్ నిమిత్తం టెండర్లను ఆహ్వానించారు. జోన్ 1బీలో.. ప్యాకేజీ–1 మాదిరిగా పనులు చేపట్టడంతో పాటు ఐదేళ్లపాటు ఆపరేషనల్ మెయింటనెన్స్ బాధ్యతలు నిర్వహించాలి. అదనంగా ఔటర్‌పై ఐకానిక్ కేబుల్ స్టేడ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

# ఎమ్మెల్సీ ఎన్నికలపై సీఎం దిశానిర్దేశం

### ఢిల్లీ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్



**వరంగల్ /అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఢిల్లీలోని తన నివాసంలో ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్, ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రనాయక్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

### అడ్డుకోబోయిన వారిపైనా దాడి.. కేసు నమోదు

**హసన్‌పర్తి/అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):**



మద్యం మత్తులో ఇంట్లోకి చొరబడి అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు, ప్రశ్నించిన వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ తెలిపారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 13న సాయంత్రం 5.30 గంటల సమయంలో తాళ్ల నేపాల్ అలియాస్ సంతోష్/సదానందం, పప్పుల హరిప్రసాద్, పోతరాజు సుజిత్, మట్టేడ శ్రీకాంత్‌తో పాటు మరో వ్యక్తి వారాల స్మశానవాటిక వద్ద మద్యం సేవించారు. అనంతరం స్థానికంగా ఉన్న సూరయ్య ఇంట్లోకి చొరబడి, ఇంటి ముందు ఉన్న నీటి సంపు వద్ద అసభ్యకరంగా ప్రవర్తించినట్లు పేర్కొన్నారు.ఆ సమయంలో ఇంట్లో ఉన్న హారిక భయంతో కేకలు వేయడంతో, సమీపంలో ఆవులను మేపుతున్న పావుశెట్టి వేణుమాధవ్ (65) అక్కడికి వచ్చి వారిని నిలదీశారు. దీంతో ఆగ్రహించిన నిందితులు వేణుమాధవ్‌పై, ఆయనకు అండగా వచ్చిన రత్నాకర్‌పై దాడి చేసి దుర్భాషలాడినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. అక్కడే ఉన్న కనపర్తి కిరణ్ జోక్యం చేసుకుని వారిని విడిపించినట్లు తెలిసింది.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ వెల్లడించారు.

# బుగులు వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న దేవాదాయ శాఖ కమిషనర్

### కుటుంబ సమేతంగా స్వామివారి సేవలో ఎం. హనుమంతరావు



**స్టేషన్ ఘన్‌పూర్/ అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):**జనగామ జిల్లా చిల్పూర్ మండల కేంద్రంలోని చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ హైదరాబాద్ కమిషనర్ ఎం. హనుమంతరావు దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వివిధ దేవాలయాల సందర్శనలో భాగంగా మంగళవారం ఆలయానికి చేరుకున్న కమిషనర్‌కు దేవస్థాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అనంతరం స్వామివారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. వేద పండితులు కమిషనర్ దంపతులకు వేద ఆశీర్వచనం అందించారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి బి. లక్ష్మీ ప్రసన్న, జూనియర్ అసిస్టెంట్ సీహెచ్. రాజేందర్ రెడ్డి, ప్రధాన అర్చకుడు బి. రవీందర్ శర్మ, అర్చకులు సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, చెరువు ఆదిత్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కల్వల ఆదర్శ పాఠశాల విద్యార్థులు

### రక్షిత్, మణిచంద్ ప్రతిభకు గుర్తింపు..

### విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

**కేసముద్రం/అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):**



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల గ్రామంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు క్రీడారంగంలో ప్రతిభ చాటారు. పాఠశాలకు చెందిన రక్షిత్, మణిచంద్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ పరిమి నవీన్, ఫిజికల్ డైరెక్టర్ లలిత వెల్లడించారు.ఈ నెల 16, 17 తేదీల్లో హనుమకొండలోని లాల్ బహదూర్ కళాశాలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు. పాఠశాల స్థాయి నుంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించడం పట్ల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రక్షిత్, మణిచంద్ తమ ప్రతిభను చాటుకుని పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. విద్యార్థులను గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

# ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవతో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ప్రభుత్వం!

### అనారోగ్య చికిత్సకు రూ.1.03 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం

### వెంటనే స్పందించిన ఎమ్మెల్యే..

### బాధిత కుటుంబానికి చెక్కు అందజేసిన సర్పంచ్ బిల్లా యాదగిరి

**వేలేరు/హనుమకొండ బ్యూరో అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేలేరు గ్రామానికి చెందిన బత్తిని సుజాత కుటుంబానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి అండగా నిలిచారు. బాధిత కుటుంబం పడుతున్న కష్టాలను గుర్తించిన ఎమ్మెల్యే వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ. 1,03,000 ఆర్థిక సాయం మంజూరు చేయించారు. మంజూరైన లక్షా మూడు వేల రూపాయల చెక్కును వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.



**బాధితుల కష్టాలపై తక్షణ స్పందన**

వేలేరు గ్రామానికి చెందిన బత్తిని సుజాత అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని సర్పంచ్ బిల్లా యాదగిరి ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం మంజూరు చేయించడంతో బాధిత కుటుంబానికి ఊరట లభించింది. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో ఆయన తరఫున సర్పంచ్ బిల్లా యాదగిరి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు.

**ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటాం**

ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స చేయించుకోలేని నిరుపేదలకు ప్రభుత్వ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందేలా చొరవ చూపిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సాధ్యమైనంత సహాయం అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

# మా ఊరికి రండి.. సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం!

### ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరానికి తప్పక రావాలి

### కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను ఆహ్వానించిన సూరారం గ్రామ పెద్దలు

**ఎల్కతుర్తి/అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** స్వాతంత్ర్య సమరయోధులు దివంగత తంగెడ గోపాల్‌రావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 25న సూరారం గ్రామంలో నిర్వహించనున్న ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరం ప్రారంభోత్సవానికి హాజరుకావాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌ను గ్రామ పెద్దలు ఆహ్వానించారు. గ్రామ ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, తమ గ్రామానికి వచ్చి సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రిని కోరినట్లు తెలిపారు.

ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో ఈ నెల 25వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు.



తంగెడ ఫౌండేషన్, విశ్వ ఆయుర్వేద పరిషత్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ పెద్దలు వెల్లడించారు. శిబిరం ప్రారంభోత్సవానికి హాజరవుతానని కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

**అండర్‌పాస్, సర్వీస్ రోడ్డు నిర్మాణాలపై వినతి**

జాతీయ రహదారి 563పై పెండింగ్‌లో ఉన్న అండర్‌పాస్, సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామస్తులు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ పనులు పూర్తికాకపోవడంతో రైతులు, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

**రామాలయ నిర్మాణానికి రూ.10 లక్షల సాయం**

సూరారం గ్రామంలో శ్రీ కోదండ రామాలయ నిర్మాణంతో పాటు శ్రీ ధన్వంతరి బహుళ ప్రయోజన భవన నిర్మాణానికి గతంలో మంత్రి ఆమోదించిన రూ. 10 లక్షల ఆర్థిక సాయాన్ని గ్రామ పెద్దలు ఈ సందర్భంగా గుర్తుచేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో తక్కళ్లపల్లి సంపత్‌రావు, భారతీయ కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు గొంగిడి మనోహర్‌రెడ్డి, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. తమ ఆహ్వానానికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు గ్రామస్తులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# పాముకాటుతో వివాహిత వాణి దుర్మరణం

### ముగ్గురు కుమార్తెలకు తీరని తల్లి లోటు.. కుటుంబంలో విషాదం

**తల్లాడ/అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** పత్తి చేనులో పత్తి తీసేందుకు వెళ్లిన ఓ వివాహిత పాము కాటుకు గురై ప్రాణాలు కోల్పోయింది. ఈ విషాద ఘటన ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని తెలగవరం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది.

గ్రామానికి చెందిన తేల్లూరి వాణి (30) మంగళవారం తెల్లవారుజామున పత్తి తీసేందుకు పొలానికి వెళ్లింది. ఈ క్రమంలో ఆమెను పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వాణిని కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

**ముగ్గురు కుమార్తెలకు దూరమైన తల్లి**

వాణికి భర్త వెంకన్నతో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబానికి అండగా ఉన్న ఆమె ఆకస్మిక



మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తల్లిని కోల్పోయిన ముగ్గురు చిన్నారుల పరిస్థితి గ్రామస్థులను కలచివేసింది. వాణి మృతితో తెలగవరం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

**పొలాల్లో అప్రమత్తత అవసరం**

వర్షాలు, పంటల పెరుగుదల నేపథ్యంలో పత్తి చేలలో కలుపు మొక్కలు, దట్టమైన ఆకులు, పొదల మధ్య పాములు సంచరించే అవకాశం ఉంటుంది. వ్యవసాయ పనులకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. పొలాల్లోకి వెళ్లేటప్పుడు పాదరక్షలు ధరించాలని, కనిపించని ప్రదేశాల్లో చేతులు పెట్టకుండా అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. పాము కాటుకు గురైతే ఎలాంటి ఆలస్యం చేయకుండా బాధితుడిని వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించాలి.

# ఎమ్మెల్సీ ఎన్నికల విజయమే లక్ష్యం

### ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం

**హసన్‌పర్తి/అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ అధిష్ఠానం కార్యాచరణకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తన నివాసంలో ఎమ్మెల్యేలతో నిర్వహించిన దిశానిర్దేశ సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ పాల్గొన్నారు.

రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ అభ్యర్థుల విజయానికి చేపట్టాల్సిన కార్యాచరణ, ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది.



ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్, ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్ర నాయక్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వాతావరణానికి అనుగుణంగా సాగు..

# రైతుకు ప్రభుత్వ భరోసా!

## ప్రత్యామ్నాయ పంటలే పరిష్కార మార్గం - రైతుకు ప్రభుత్వం..

## ప్రభుత్వానికి రైతు సహకరిస్తేనే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోగలం -శాస్త్రీయ సాగు విధానాలతోనే వ్యవసాయానికి భవిష్యత్తు

ప్రకృతి ఎప్పుడు కరుణిస్తుందో.. ఎప్పుడు కన్నెర్ర చేస్తుందో తెలియని పరిస్థితులు! వర్షాలు పడతాయని ఆశించి సాగు చేస్తే వాన ముఖం చాటేస్తోంది.. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని భావిస్తే అతివృష్టి పంటలను ముంచెత్తుతోంది.

మారుతున్న వాతావరణ పరిస్థితులు రైతు సాగు ప్రణాళికలను తలకిందులు చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో పాత పద్ధతులనే పట్టుకుని ముందుకెళ్లడం కంటే.. వాతావరణానికి అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లాల్సిన అవసరం ఏర్పడింది. రైతులకు సరైన సమయంలో అవగాహన కల్పించి, నేల స్వభావం, నీటి లభ్యత, వర్షపాతం ఆధారంగా అనువైన పంటలను ప్రభుత్వం సూచించాలి. అదే సమయంలో ప్రభుత్వం అందించే శాస్త్రీయ సలహాలు, పంటల మార్పిడి సూచనలు, నీటి పొదుపు పద్ధతులను రైతులు కూడా పరిశీలించి సహకరించాలి. ప్రభుత్వం రైతుకు అండగా నిలవాలి.. రైతు ప్రభుత్వ సూచనలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పాటించాలి. ఇరువైపులా సమన్వయం ఉంటేనే వర్షాభావం, అధిక ఉష్ణోగ్రతలు, అకాల వర్షాల వంటి సవాళ్లను సమర్థంగా ఎదుర్కొని వ్యవసాయాన్ని కాపాడుకోగలం.

మారుతున్న వాతావరణం.. మారాల్సిన సాగు విధానం

వ్యవసాయం నేడు ప్రకృతిపై ఆధారపడిన అత్యంత అనిశ్చిత రంగంగా మారుతోంది. వర్షాలు సకాలంలో కురవకపోవడం, ఉష్ణోగ్రతలు పెరగడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం, పంటల ఎదుగుదల దశల్లో వాతావరణం అనుకూలించకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఒకే పంటను వరుసగా సాగు చేయడం, నీటి లభ్యతను అంచనా వేయకుండా అధిక నీరు అవసరమయ్యే పంటలు వేయడం కొన్ని ప్రాంతాల్లో రైతులకు అదనపు భారంగా మారవచ్చు.

ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి. వర్షాధార ప్రాంతాల్లో నేల స్వభావం, అందుబాటులో ఉన్న తేమ, స్థానిక వాతావరణ పరిస్థితులను బట్టి కంది, పెసర, మినుము, శనగ, జొన్న, సజ్జ, ఇతర చిరుధాన్యాలు, నూనెగింజల పంటలను పరిశీలించేలా రైతులకు సూచనలు ఇవ్వాలి. అయితే అన్ని ప్రాంతాలకు ఒకే పంటను సూచించకుండా, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ నిపుణుల సలహాతో పంటలను ఎంపిక చేసుకునేలా చూడాలి.



### ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు భరోసా ఏదీ?

పంట మార్పిడి గురించి చెప్పడం మాత్రమే సరిపోదు. రైతు ఏళ్ల తరబడి ఒక పంట సాగు చేస్తూ వస్తుంటే, మరో పంటకు మారేందుకు వెనుకాడటం సహజం. కొత్త పంటకు మార్కెట్ ఉంటుందా? దిగుబడి వస్తుందా? పెట్టుబడి తిరిగి వస్తుందా? కొనుగోలు చేసే సంస్థలు అందుబాటులో ఉంటాయా? అనే సందేహాలు రైతును వెంటాడుతాయి. అందుకే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించే ప్రభుత్వం ఆ పంటలకు అవసరమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు, పెట్టుబడి సహాయం, కొనుగోలు సదుపాయాలపై కూడా స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలి.

రైతులు పంట మార్పిడికి ముందుకొచ్చేలా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రయోగాత్మకంగా సాగు చేసే రైతులకు సాంకేతిక సహకారం అందించాలి. పంటకు మార్కెట్ అవకాశాలు, అంచనా పెట్టుబడి, నీటి అవసరం, తెగుళ్ల ముప్పు వంటి అంశాలను ముందుగానే వివరించాలి. ప్రత్యామ్నాయ పంటల వల్ల నష్టాలు ఎదురైతే వర్తించే బీమా, ఇతర సహాయ పథకాల వివరాలను కూడా తెలియజేయాలి. రైతుకు నమ్మకం కలిగించినప్పుడే పంటల మార్పిడి విజయవంతమవుతుంది.

### రైతుకు ప్రభుత్వం సహకరించాలి

వాతావరణ మార్పులను ఎదుర్కొనే బాధ్యతను పూర్తిగా రైతుపైనే వేయలేం. రైతుకు అవసరమైన సమాచారం, విత్తనాలు, సాగునీటి సదుపాయాలు, పంటల బీమా, మార్కెట్ భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. వర్షాభావ పరిస్థితులు ఏర్పడే సూచనలు ఉన్నప్పుడు ముందస్తు ప్రణాళిక రూపొందించాలి. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకునే పద్ధతులపై శిక్షణ ఇవ్వాలి. బిందు, తుంపర సేద్యాన్ని అవసరమైన ప్రాంతాల్లో ప్రోత్సహించాలి. చెరువులు, కుంటలు, వర్షపు నీటి నిల్వ వ్యవస్థలను బలోపేతం చేయాలి.

వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలి. వాతావరణ హెచ్చరికలను గ్రామస్థాయిలో చేరవేయాలి. పంట నష్టం జరిగితే అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం సకాలంలో పరిహారం అందించాలి. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసిన రైతులకు కొనుగోలు సదుపాయాలు కల్పించి, గిట్టుబాటు ధర లభించేలా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం నుంచి అందే సహకారం క్షేత్రస్థాయిలో రైతుకు చేరినప్పుడే పథకాల అసలు లక్ష్యం నెరవేరుతుంది.

### ప్రభుత్వానికి రైతులు సహకరించాలి

రైతుల భాగస్వామ్యం కూడా అంతే ముఖ్యం. వాతావరణ పరిస్థితులు అనుకూలించని సమయంలో కేవలం సంప్రదాయ సాగు విధానాలపైనే ఆధారపడకుండా వ్యవసాయ శాఖ సూచనలను పరిశీలించాలి. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలి. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలి. పంటల మార్పిడి, అంతర పంటల సాగు, నేలలో తేమను కాపాడే పద్ధతులను అవసరానికి అనుగుణంగా అవలంబించాలి.

అదే సమయంలో రైతులు తమ ప్రాంతంలో ఎదురవుతున్న సమస్యలను వ్యవసాయ అధికారులకు తెలియజేయాలి. విత్తనాల ఎంపిక నుంచి పంట కోత వరకు శాస్త్రీయ సూచనలు తీసుకోవాలి. అయితే ప్రభుత్వం సూచించిన పంటలను సాగు చేయాలంటే రైతుకు సాధ్యాసాధ్యాలు, మార్కెట్ పరిస్థితులు, నీటి వనరులు, పెట్టుబడి సామర్థ్యం గురించి తెలుసుకునే అవకాశం ఉండాలి. రైతుల అనుభవాన్ని, స్థానిక పరిస్థితులపై వారికి ఉన్న అవగాహనను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. పరస్పర చర్చలు, నమ్మకం, సమన్వయంతోనే సాగులో సరైన నిర్ణయాలు తీసుకోగలం.

### వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు ఉమ్మడి కార్యాచరణ

వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోవాలంటే ప్రభుత్వం ఒకవైపు, రైతులు మరోవైపు అన్నట్లుగా కాకుండా ఉమ్మడి బాధ్యతతో ముందుకెళ్లాలి. ప్రభుత్వం శాస్త్రీయ ప్రణాళికలు రూపొందించాలి. రైతులు తమ పొలాల పరిస్థితులకు అనుగుణంగా వాటిని అమలు చేసుకోవాలి. నీటి సంరక్షణ, పంటల వైవిధ్యం, తక్కువ నీటితో పండే పంటల ప్రోత్సాహం, సాగు ఖర్చుల తగ్గింపు, మార్కెట్ సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

ప్రత్యామ్నాయ పంటల సాగు అనేది కేవలం వర్షాలు లేనప్పుడు తీసుకునే తాత్కాలిక చర్యగా కాకుండా, వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయాన్ని బలోపేతం చేసే దీర్ఘకాలిక వ్యూహంగా ఉండాలి. పంటల ఎంపిక నుంచి కొనుగోలు వరకు రైతుకు భరోసా కల్పించినప్పుడే ఈ ప్రయత్నాలు ఫలిస్తాయి.

### సమన్వయమే వ్యవసాయానికి రక్షణ

మారుతున్న వాతావరణ పరిస్థితులను రైతు ఒక్కడే ఎదుర్కోలేడు. ప్రభుత్వ సహకారం లేకుండా ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తరించడం కష్టం. అదే సమయంలో అందుబాటులో ఉన్న శాస్త్రీయ సమాచారం, స్థానిక పరిస్థితులకు సరిపోయే సూచనలను రైతులు పరిగణనలోకి తీసుకోకపోతే ఆశించిన ఫలితాలు రావు. అందువల్ల ప్రభుత్వం రైతుకు అండగా నిలవాలి..

### రైతు కూడా ప్రభుత్వ వ్యవసాయ ప్రణాళికల్లో భాగస్వామి కావాలి.

ప్రకృతిని మనం నియంత్రించలేకపోవచ్చు.. కానీ ప్రకృతి మార్పులకు అనుగుణంగా సాగు విధానాలను మార్చుకోవచ్చు. రైతుకు భరోసా ఇచ్చే ప్రభుత్వం, ప్రభుత్వంతో సమన్వయంగా ముందుకెళ్లే రైతులు కలిస్తే వర్షాభావం, అధిక ఉష్ణోగ్రతలు, అకాల వర్షాల సవాళ్లను ఎదుర్కోవడం సాధ్యమవుతుంది. రైతు బాగుంటేనే వ్యవసాయం బాగుంటుంది.. వ్యవసాయం బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది!



సీనియర్ జర్నలిస్ట్ కొట్టే సుధాకర్ (లెనిన్)
టి.యు.డబ్ల్యూ.జే (IJU) జిల్లా కార్యవర్గ సభ్యులు
జర్నలిస్ట్ వార్త ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో
9908401581

# నాగరాజు విజన్‌పై విమర్శలు.. హాస్యాస్పదం!

### గత పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమా?

**ఐనవోలు/ అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజుకు విజన్ లేదంటూ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని ఐనవోలు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్ విమర్శించారు. అభివృద్ధిపై మాట్లాడే ముందు గతంలో అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన పనులు, తీసుకొచ్చిన నిధులు, ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో సుమారు 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టడం పేదల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్న తీరుకు నిదర్శనమని పేర్కొన్నారు.



పేదలకు ఇళ్లు కల్పించడం, అర్హులకు సంక్షేమ పథకాలు అందించడం, విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యమివ్వడం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం విజన్‌లో భాగం కాదా? అని మోహన్ గౌడ్ ప్రశ్నించారు. గత పాలనలో ఏ గ్రామానికి ఎంత అభివృద్ధి చేశారు? ఎన్ని నిధులు తీసుకొచ్చారు? ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలు కల్పించారు? అనే అంశాలపై బహిరంగ చర్చకు రావాలని ఆరూరి రమేష్‌కు సవాల్ విసిరారు. వ్యక్తిగత విమర్శలకు బదులుగా వాస్తవాలు, ఆధారాలతో మాట్లాడాలని హితవు పలికారు.

ఎమ్మెల్యే నాగరాజు దైవభక్తిపై విమర్శలు చేయడాన్ని కూడా మోహన్ గౌడ్ తప్పుబట్టారు. దేవుడి సన్నిధిలో భక్తులందరూ సమానమేనని, ఆర్భాటాల కంటే భక్తి పట్ల గౌరవం, సేవాభావం, సమానత్వమే ముఖ్యమని పేర్కొన్నారు. ధార్మిక అంశాలను రాజకీయ విమర్శలకు వాడుకోవడం సరికాదన్నారు.

రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినప్పటికీ, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చ జరగాలని మోహన్ గౌడ్ సూచించారు. గత, ప్రస్తుత పాలనల పనితీరును గణాంకాలు, అధికారిక రికార్డుల ఆధారంగా పోల్చి చూద్దామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల పనితీరుపై అంతిమ నిర్ణయం తీసుకునేది ప్రజలేనని స్పష్టం చేశారు.

# అన్నపూర్ణాదేవి అవతారంలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ

### శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు..

### అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

**స్టేషన్ ఘన్‌పూర్/అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని తాటికొండ గ్రామంలో కొలువుదీరిన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రెండో రోజు దుర్గామాత అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు జీడికంటి వరుణాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకం, జలాభిషేకం, గణపతి పూజ, నవగ్రహ పూజ, అర్చన, హోమం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం కుంకుమపూజ, అర్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పండగ బుచ్చయ్య, అర్చకుడు జీడికంటి వరుణాచార్యులు, భవానీమాల స్వాములు పండగ రాజేశ్వర్, పర్శ రాజు, పండుగ సత్తయ్య, పండుగ రవి, అక్కెనపల్లి రాములు, మారపాక నాగరాజు, అక్కెనపల్లి రాకేష్, శ్రీపతి రాజు, నారబోయిన కార్తీక్, చిలువేరు వర్షిత, మొగ్గం ప్రవస్థి తదితరులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.



# తండాల పేదలకు త్వరలోనే పక్కా ఇళ్లు!

### సర్పంచ్ వినతిపై సీఈ సానుకూల స్పందన

**కేసముద్రం/అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల పరిధిలోని తండాల్లో నివసిస్తున్న నిరుపేద గుడిసె వాసులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజినీర్ చైతన్య కుమార్ హామీ ఇచ్చారు. అర్హులైన పేద కుటుంబాలకు పక్కా ఇళ్లు కల్పించాలని కోరుతూ సర్పంచ్ వాంకుడోత్ రవి నాయక్ చేసిన విజ్ఞప్తిపై సీఈ సానుకూలంగా స్పందించారు.



### గుడిసెల్లోనే పేదల జీవనం

కేసముద్రం మండల పరిధిలోని బిచ్యనాయక్ తండా, రాజీవ్ నగర్ తండా, హరిచంద్రు తండాల్లో పలువురు నిరుపేదలు దశాబ్దాలుగా సరైన నివాస వసతి లేక గుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నారు. వర్షాకాలంలో వానలకు, చలికాలంలో చలికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ రవి నాయక్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన గుడిసె నివాసితులందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.

### అర్హులందరికీ ఇళ్లు కల్పించాలి

ఈ మేరకు మంగళవారం హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజినీర్ చైతన్య కుమార్‌ను కలిసి సర్పంచ్ వాంకుడోత్ రవి నాయక్ వినతిపత్రం సమర్పించారు. తండాల్లోని పేదల నివాస సమస్యను వివరించి, అర్హులైన ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఈ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రతినిధులు సంతోష్, నవీన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# భూ రీసర్వే పారదర్శకంగా చేపట్టాలి

### రైతుల భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి



**తల్లాడ/అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** ఖచ్చితమైన భూ వివరాల నమోదు, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరును స్థానిక తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. భూముల వివరాల నమోదు సమయంలో రైతులకు సంబంధించిన రికార్డులను జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. మొదటి విడతలో భాగంగా తల్లాడ మండలంలోని లక్ష్మీపురం, కుర్నవల్లి, తెలగారం, బసవాపురం గ్రామాల్లో భూ రీసర్వే కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డితో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# మేఘ్య తండాలో పోలీసుల విస్తృత తనిఖీలు

**4 వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం..**

**50 లీటర్ల గుడుంబా స్వాధీనం**

**ద్విచక్ర వాహనాల తనిఖీ..**

**ఐదుగురిపై కేసులు నమోదు**



**కేసముద్రం/అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** అక్రమ గుడుంబా తయారీ, విక్రయాల కట్టడికి పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలోని కోరుకొండపల్లి గ్రామ శివారులో ఉన్న మేఘ్య తండాలో మంగళవారం తెల్లవారుజామున పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా చేపట్టిన ఈ తనిఖీల్లో అక్రమ గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 4 వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేయడంతో పాటు, 50 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత పదార్థాల తయారీ, విక్రయాలకు సంబంధించి ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కేసముద్రం సీఐ వై. సత్యనారాయణ నేతృత్వంలో మంగళవారం ఉదయం 5.30 నుంచి 7.30 గంటల వరకు ఈ తనిఖీలు కొనసాగాయి. సుమారు 100 ఇళ్లు ఉన్న తండాలో పోలీసులు ఇంటింటా సోదాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం ఎస్ఐ కె. క్రాంతికిరణ్, నెల్లికుదురు ఎస్ఐ జి. కరుణాకర్, ఇనుగుర్తి ఎస్ఐ పి. నరేష్‌తో పాటు కేసముద్రం సర్కిల్ పరిధికి చెందిన 30 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీల్లో భాగంగా గుడుంబా తయారీ కోసం నిల్వ ఉంచిన బెల్లం పానకాన్ని పోలీసులు ధ్వంసం చేశారు. 50 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. తండాలో 50 ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి, నిబంధనల ఉల్లంఘనలపై కూడా పరిశీలన చేపట్టారు. అక్రమ మద్యం తయారీ, విక్రయాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు.

తనిఖీల అనంతరం తండావాసులతో నిర్వహించిన సమావేశంలో సీఐ వై. సత్యనారాయణ సైబర్ నేరాలు, రోడ్డు భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,



ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు.

గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రజలకు భద్రత కల్పించడంతో పాటు నేరాల నియంత్రణ, అక్రమ గుడుంబా తయారీ నిర్మూలనే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.

# ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన నారపోగు వెంకటేశ్వర్లు

**నిరసన కార్యక్రమం విజయవంతం కావడంపై సీఎంకు ధన్యవాదాలు**



**తల్లాడ/అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** ఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారపోగు వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలో నిర్వహించిన నిరసన కార్యక్రమం విజయవంతం కావడంతో ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీలోని ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఈ భేటీలో నారపోగు వెంకటేశ్వర్లు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి సీఎంను కలిశారు. నిరసన కార్యక్రమానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మానకొండూరు ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ విభాగం చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లపై శిక్షణా తరగతులు

## అర్హులందరికీ ఇళ్లు అందేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలి






**తల్లాడ/అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** ఱ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై అధికారులకు అవగాహన కల్పించేందుకు తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్, ఖమ్మం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ, లబ్ధిదారుల ఎంపిక, జియో ట్యాగింగ్, బిల్లుల చెల్లింపు, గృహ నిర్మాణంలో పాటించాల్సిన నాణ్యతా ప్రమాణాలపై గ్రామ పంచాయతీ కార్యదర్శులకు వివరంగా అవగాహన కల్పించారు. పథకం అమలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, నిర్మాణ పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా గ్రామ పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. లబ్ధిదారుల వివరాలను పరిశీలించి ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, గృహ నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి, ఏపీఓ (వీబీ–జీ రామ్ జీ), మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో పలు శుభకార్యాల్లో పాల్గొన్న యువ నాయకుడు బత్తుల సాయి ప్రసన్న కుమార్

**జాటావత్, హాట్యా తండాల్లో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు**



**మిర్యాలగూడ/అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో మంగళవారం నిర్వహించిన పలు శుభకార్యాల్లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) తనయుడు, యువ నాయకుడు బత్తుల సాయి ప్రసన్న కుమార్ పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొని స్థానికులతో మమేకమయ్యారు. మొదట మిర్యాలగూడ పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన గ్యార్మీ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మిర్యాలగూడ మండలంలోని జాటావత్ తండాలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఇళ్లను ప్రారంభించారు. తదుపరి హాట్యా తండాలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఖద్దరు వెనుక కష్టాలు..

## కార్యకర్తల ఆర్థిక బలోపేతం ఎప్పుడు?

**రాజకీయ ఎదుగుదలకు శ్రమిస్తున్న కార్యకర్తలు -ఆర్థిక బలోపేతానికి పక్కా కార్యాచరణ అవసరం**

**జర్నలిస్ట్ వార్త/ప్రత్యేక కథనం**

రాజకీయాల్లో ఒక నాయకుడి ఎదుగుదల వెనుక ఎంతోమంది కార్యకర్తల శ్రమ, సమయం, త్యాగాలు దాగి ఉంటాయి. నాయకుడి పిలుపునకు స్పందించడం నుంచి ప్రజల్లోకి వెళ్లి కార్యక్రమాలను విజయవంతం చేయడం వరకు కార్యకర్తల పాత్ర కీలకం. అయితే రాజకీయంగా నాయకత్వం బలపడుతున్న సమయంలో కార్యకర్తల వ్యక్తిగత, ఆర్థిక జీవితాల్లోనూ సమాంతరంగా పురోగతి కనిపించాల్సిన అవసరం ఉంది. ఖాదర్ రాజకీయ ప్రయాణం నేపథ్యంలో కార్యకర్తల కష్టాలు, వారి ఆర్థిక స్థితిగతులు, భవిష్యత్తు అవకాశాలపై సమగ్రంగా దృష్టి సారించాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

### కార్యకర్తల శ్రమకు గుర్తింపు అవసరం

రాజకీయ కార్యక్రమాల నిర్వహణ, ప్రజలతో నిరంతర సంబంధాలు, పార్టీ కార్యకలాపాల విస్తరణలో క్షేత్రస్థాయి కార్యకర్తలే కీలకంగా వ్యవహరిస్తారు. తమ వ్యక్తిగత పనులను పక్కనపెట్టి కార్యక్రమాలకు హాజరయ్యే వారు కూడా ఉంటారు. కొందరు ప్రయాణ ఖర్చులు, ఇతర అవసరాల కోసం సొంత డబ్బును వెచ్చిస్తుంటారు. ఈ క్రమంలో వారి కుటుంబ బాధ్యతలు, ఉపాధి, ఆదాయంపై ప్రభావం పడే అవకాశం ఉంది.

కార్యకర్తల సేవలను గుర్తించడం కేవలం సన్మానాలు, ప్రశంసలకే పరిమితం కాకూడదు. వారి కుటుంబ పరిస్థితులను అర్థం చేసుకోవడం, ఉపాధి అవకాశాల కల్పనకు సహకరించడం, అర్హతను బట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా మార్గనిర్దేశం చేయడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే రాజకీయ అనుబంధం వ్యక్తిగత జీవితాల పురోగతికి కూడా తోడ్పడుతుంది.

### ఆర్థిక బలోపేతంలో ప్రణాళిక కీలకం

రాజకీయంగా చురుగ్గా ఉండటం, ఆర్థికంగా స్థిరపడటం రెండూ వేర్వేరు అంశాలు. కార్యకర్తల ఆర్థిక పరిస్థితి



మెరుగుపడాలంటే తాత్కాలిక సహాయంతోపాటు దీర్ఘకాలిక ఉపాధి మార్గాలపై దృష్టి పెట్టాలి. నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాల ఏర్పాటుకు మార్గదర్శకత్వం, బ్యాంకు రుణాలు మరియు అర్హత ఆధారిత ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం వంటి చర్యలు ఉపయోగపడతాయి.

ఇలాంటి కార్యక్రమాలు వ్యక్తిగత పరిచయాలు లేదా అప్పుడప్పుడు అందించే సహాయానికి పరిమితం కాకుండా పారదర్శకమైన కార్యాచరణతో కొనసాగాలి. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను గుర్తించడం, వారి అవసరాలను అంచనా వేయడం, అందుబాటులో ఉన్న అవకాశాలతో అనుసంధానించడం వంటి చర్యల ద్వారా దీర్ఘకాలిక ఫలితాలు సాధ్యమవుతాయి.

### నాయకత్వం బాధ్యత.. కార్యకర్తలకు భరోసా

ఖాదర్‌తో అనుబంధం ఉన్న కార్యకర్తల సంక్షేమం, వారి ఆర్థిక పురోగతిపై చర్చ జరిగేటప్పుడు వాస్తవ పరిస్థితులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇప్పటికే చేపట్టిన సహాయక కార్యక్రమాలు ఉంటే వాటి వివరాలు, లబ్ధి పొందిన కుటుంబాలు, ఉపాధి అవకాశాలు పొందినవారి సమాచారం ఆధారాలతో వెల్లడించాలి. కార్యక్రమాలు లేకపోతే కార్యకర్తల అవసరాలను గుర్తించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం ప్రయోజనకరంగా ఉంటుంది. నాయకత్వం, కార్యకర్తల మధ్య సంబంధం కేవలం రాజకీయ కార్యక్రమాల నిర్వహణకే పరిమితం కాకూడదు. పరస్పర విశ్వాసం, కష్టకాలంలో అండగా నిలవడం, కుటుంబాల సంక్షేమానికి తోడ్పడటం ద్వారా ఆ బంధం మరింత బలపడుతుంది. కార్యకర్తల సమస్యలను వినేందుకు క్రమబద్ధమైన వ్యవస్థ ఉండటం, పరిష్కారానికి తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించడం కూడా కీలకం.

### ఎదుగుదల అందరికీ చేరినప్పుడే సార్థకత

రాజకీయ విజయాన్ని నాయకుడి వ్యక్తిగత ఎదుగుదలతో మాత్రమే కొలవలేం. ఆయనతో కలిసి పనిచేసిన కార్యకర్తలకు లభించిన అవకాశాలు, వారి కుటుంబాల జీవన ప్రమాణాల్లో వచ్చిన మార్పు, ఉపాధి పరంగా సాధించిన పురోగతి కూడా ముఖ్యమైన అంశాలే. ఈ వివరాలను ఆధారాలతో విశ్లేషించినప్పుడే నాయకత్వం, కార్యకర్తల మధ్య ఉన్న సంబంధం వాస్తవ రూపం స్పష్టమవుతుంది.

రాజకీయ ప్రయాణంలో కార్యకర్తల శ్రమకు గుర్తింపు ఇవ్వడంతోపాటు వారి ఆర్థిక స్వావలంబనకు మార్గాలు చూపడం అవసరం. నాయకుడి ఎదుగుదలతో పాటు కార్యకర్తల కుటుంబాల్లోనూ అభివృద్ధి కనిపించేలా ప్రణాళికలు అమలైతేనే ఆ ప్రయాణానికి సమగ్ర సార్థకత చేకూరుతుంది. ఖాదర్‌తో పాటు నడిచిన కార్యకర్తల జీవితాల్లోనూ స్థిరమైన మార్పు తీసుకొచ్చే కార్యాచరణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

# రెడ్‌క్రాస్ చైర్మన్‌కు సన్మానం..

## క్రీడాకారుడికి ఆర్థిక సాయం



**వరంగల్ బ్యూరో/అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా నూతన చైర్మన్ బేతి అశోక్‌బాబును రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు సోమ వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాతీయస్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారుడు చిరంజీవి చేతన్ శౌర్యకు ఆర్థిక సాయం అందజేశారు. క్రీడల్లో మరింత రాణించేందుకు ఈ సహాయం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. రెడ్‌క్రాస్ సభ్యుడు, రొటేరియన్ తోట సంపత్‌ను, వరంగల్ జిల్లా ఫోటోగ్రఫీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రొటేరియన్ వంగరి వేణుగోపాల్‌ను సత్కరించారు. సామాజిక సేవకులను గౌరవించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ కార్యదర్శి నాయిని అనిల్‌కుమార్, జూలూరి కృష్ణమూర్తి, అసిస్టెంట్ గవర్నర్ పోరాడ్ల రత్నాకర్, కుమారస్వామి, కోరే చంద్రమౌళి, కొడం రాజేందర్, సుంకనపల్లి శ్రీనివాస్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

### ఏపీకి వర్ష సూచన.. రానున్న మూడు రోజులు వానలు

**విజయవాడ అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. బంగాళాఖాతంపై ఏర్పడిన ద్రోణితో పాటు ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు నమోదవుతాయని ఏపీఎస్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం, బుధవారం (అక్టోబర్ 14) పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖ, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలతో పాటు పోలవరం పరిసర ప్రాంతాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగతా జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచించారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున వర్షం సమయంలో చెట్లు, భారీ హోర్డింగుల కింద నిలబడవద్దని హెచ్చరించారు.

# నాది బాల్ థాకరే పాత్ర

## మరోసారి చెపుతున్నా.. అధికారం జెన్-జీది: విజయసాయిరెడ్డి



**అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):**
రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి తన రాజకీయ భవిష్యత్‌పై మరో ప్రకటన చేశారు. ఆయన త్వరలోనే పార్టీ పెట్టబోతుండడం తెలిసిందే. అందుకు తగిన సన్నాహాలు జోరుగా సాగుతున్నాయని వెల్లడించారు. రాజకీయాల్లో తనది బాల్ థాకరే (శివసేన వ్యవస్థాపకుడు) వంటి పాత్రేనని, అధికారం యువతరానిదే (జెన్–జీ) అని తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. "పార్టీ పేరు, జెండా, ఎజెండా ఈ పవిత్ర దసరా పర్వదినాల్లో సిద్ధం అవుతున్నాయి" అని వెల్లడించారు. తాను పార్టీ పెట్టవద్దని కోరుకునే వారు చేస్తున్న చౌకబారు ప్రచారాలకు విలువివ్వాల్సిన అవసరం లేదని కొట్టిపారేశారు. రాష్ట్రంలోని రెండు కుటుంబ పార్టీలపై తిరుగుబాటుగానే తన పార్టీ ఆవిర్భవిస్తుందని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో మెరికల్లాంటి కొత్త నాయకత్వాన్ని తయారు చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. "మరోసారి చెపుతున్నా... అధికారం జెన్–జీది, నాది బాల్ థాకరే పాత్ర" అని తన పోస్టులో వివరించారు. గత సార్వత్రిక ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో విజయసాయిరెడ్డి వైసీపీకి దూరమైన విషయం తెలిసిందే. ఆ తర్వాత పార్టీకి రాజీనామా చేసి, కొంతకాలం వ్యవసాయంపై దృష్టి సారించారు. ఆయన వేరే పార్టీలో చేరతారంటూ ప్రచారం జరిగినా, వాటన్నింటినీ తోసిపుచ్చుతూ సొంతంగా పార్టీ పెట్టడానికే మొగ్గు చూపారు. తాజా పోస్టుతో విజయసాయిరెడ్డి ఏపీ రాజకీయాల్లో తన తదుపరి అడుగులను ఖరారు చేసినట్టయింది.

# బెంగళూరు పబ్‌లో రగడ.. ఏపీ ఐఏఎస్ అధికారిపై క్రిమినల్ కేసు?

**బెంగళూరు పబ్‌లో పోలీసులతో వాగ్వాదానికి దిగిన ఏపీ ఐఏఎస్ అధికారి**

**అధికారి వికాస్ మర్మత్‌తో పాటు ఆయన స్నేహితులపై క్రిమినల్ కేసు నమోదు**

**సీఎం నియోజకవర్గం కుప్పం అభివృద్ధి ప్రాధికార సంస్థ పీడీగా బాధ్యతలు**

**అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన యువ ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ బెంగళూరులో తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. నగరంలోని ఓ పబ్‌లో పోలీసు విధులకు ఆటంకం కలిగించారన్న ఆరోపణలపై ఆయనతో పాటు ఆయన స్నేహితులపై అక్కడి పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పాటు, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లగా, దీనిపై ఆయన తీవ్రంగా స్పందించి, పూర్తిస్థాయి విచారణ జరపాలని సీఎస్ ను ఆదేశించినట్టు తెలుస్తోంది.
వివరాల్లోకి వెళితే, అక్టోబర్ 9వ తేదీ అర్ధరాత్రి దాటిన



తర్వాత బెంగళూరు రెసిడెన్సీ రోడ్డులోని 'కావోర్ బార్ అండ్ రెస్టారెంట్'లో సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సీసీబీ) పోలీసులు తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా సమయం దాటినా పబ్ నడుపుతుండటంతో పాటు, వయసు నిర్ధారణ కోసం అక్కడ ఉన్న వారి ఐడీ కార్డులను పరిశీలిస్తున్నారు. ఆ సమయంలో అక్కడే స్నేహితులతో ఉన్న వికాస్ మర్మత్, పోలీసులతో వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది. మద్యం మత్తులో ఉన్న ఆయన, పోలీసులను దూషించడమే కాకుండా, వారిపై దాడికి ప్రయత్నించి విధులకు ఆటంకం కలిగించారని సీసీబీ ఇన్‌స్పెక్టర్ అరుణ్ సాలుంకే ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమయ్యాయి. ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో వికాస్ మర్మత్‌తో పాటు ఆయన స్నేహితులు అభయ్, ఉదయ్ సింగ్, నితీష్, రోషన్‌లపై వివిధ సెక్షన్ల కింద కేసు (క్రైమ్ నం. 150/2026) నమోదు చేశారు. వికాస్ మర్మత్ 2019 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఆయన ప్రస్తుతం చిత్తూరు జిల్లాలోని కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (KADA) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కావడం గమనార్హం. ఉన్నత హోదాలో ఉన్న అధికారి ఇలాంటి వివాదంలో చిక్కుకోవడంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఈ ఘటనపై విచారణ జరిపి నివేదికను సిద్ధం చేయనున్నారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# పంజాబ్‌లో దారుణం.. డ్రగ్స్‌పై పోరాడుతున్న యాక్టివిస్ట్ లైవ్‌లోనే కాల్చివేత!

**అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):**
గతంలోనూ నిందితుడిపై పలు కేసులు ఉన్నట్లు వెల్లడి
పంజాబ్‌లో తీవ్ర కలకలం రేపిన ఘటనలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఓ సామాజిక కార్యకర్త దారుణ హత్యకు గురయ్యారు. పర్విందర్ సింగ్ జోతా అనే యాక్టివిస్ట్‌ను ఓ మెడికల్ షాపు యజమాని కాల్చి చంపాడు. ఈ దారుణం మొత్తం జోతా ఫేస్‌బుక్ ఖాతా నుంచి ప్రత్యక్ష ప్రసారం కావడం సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘటన ఇవాళ ఉదయం పంజాబ్‌లోని మాన్సా పట్టణంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. కొన్ని సంవత్సరాలుగా డ్రగ్స్ మాఫియాకు వ్యతిరేకంగా పోరాడుతున్న పర్విందర్ సింగ్ జోతా, స్థానిక మెడికల్ షాపుల్లో సింథటిక్ డ్రగ్స్ అక్రమ అమ్మకాలను సోషల్ మీడియా లైవ్ వీడియోల ద్వారా బహిర్గతం చేస్తుంటారు. ఈ క్రమంలో ఈరోజు ఉదయం, అశ్వనీ కుమార్ అనే వ్యక్తికి చెందిన మెడికల్ షాపు వద్దకు వెళ్లారు. ఉదయం అదే షాపులో



నిషేధిత మందులు కొనుగోలు చేశాడని చెబుతున్న ఓ వృద్ధుడిని కూడా ఆయన వెంట తీసుకెళ్లారు. డ్రగ్స్ అమ్మకాలపై యజమానిని నిలదీయడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ వాగ్వాదాన్ని జోతా ఫేస్‌బుక్‌లో లైవ్ స్ట్రీమింగ్ చేస్తుండగా, యజమాని అశ్వనీ కుమార్ తుపాకీ బయటకు తీశాడు. అది చూసిన జోతా ఏమాత్రం భయపడకుండా, 'నన్ను చంపు' అంటూ అతడికి పలుమార్లు సవాలు విసిరాడు. దీంతో ఆగ్రహానికి గురైన అశ్వనీ కుమార్.. జోతాపై కాల్పులు జరిపాడు. పొట్ట, తొడ భాగంలోకి బుల్లెట్లు దూసుకెళ్లగా, ఒక బుల్లెట్ కాలేయాన్ని చీల్చడంతో జోతా అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని మాన్సా సివిల్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ కాల్పుల్లో జోతా సహచరులలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి.
హత్య అనంతరం నిందితుడు అశ్వనీ కుమార్ అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు అతడిని గుర్తించి, పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడిపై గతంలోనూ పలు కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు. తన క్రియాశీల కార్యకలాపాల వల్ల జోతా కూడా 2023లో ఒకసారి అరెస్ట్ అయ్యారు. ఈ హత్య ఘటన పంజాబ్‌లో మాదకద్రవ్యాల సమస్య తీవ్రతను మరోసారి కళ్లకు కట్టింది.

# రాహుల్ గాంధీ నన్ను తోసేశారు

## : గర్భిణీ జర్నలిస్ట్ సంచలన ఆరోపణ



**అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):**
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఒక మహిళా జర్నలిస్ట్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఢిల్లీలో సుప్రీంకోర్టు సమీపంలో జరిగిన నిరసన కార్యక్రమంలో రాహుల్ తన చేయి పట్టుకుని లాగి, తోసేశారని ఆమె ఆరోపించారు. మూడు నెలల గర్భిణి అయిన జర్నలిస్ట్ రిచా పరాశర్ ఈ ఘటన తర్వాత ఆసుపత్రిలో చేరారు. అయితే, ఈ ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఇదంతా బీజేపీ చేస్తున్న దుష్ప్రచారం అని కొట్టిపారేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిన్న ఇండియా కూటమి నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ నుంచి సౌండ్‌బైట్ తీసుకునేందుకు ప్రయత్నించానని రిచా తెలిపారు. ఆ సమయంలో రాహుల్ తన చేయి పట్టుకుని దూకుడుగా లాగారని, వెంటనే ఆయన బాడీగార్డులు కూడా తోసేయడంతో మెట్లపై పడిపోయానని ఆమె వాపోయారు. తన కెమెరామెన్‌ను కూడా తోయడంతో అతను తనపై పడ్డాడని వివరించారు. ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. పలువురు నేతలు ఆసుపత్రికి వెళ్లి రిచాను పరామర్శించారు. రాహుల్ తీరుపై కేంద్ర మంత్రి అన్నపూర్ణా దేవి మండిపడ్డారు. మరోవైపు, కాంగ్రెస్ నేత అల్కా లాంబా ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. జర్నలిస్ట్ ఆసుపత్రిలో చేరిన సమయం, గర్భవతిగా ఉన్నప్పుడు ఎక్స్‌రే తీయడం వంటి అంశాలపై ఆమె సందేహాలు వ్యక్తం చేశారు. ఇది బీజేపీ ఆడిస్తున్న నాటకమని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

# ముందుగానే మెసేజ్‌లు షెడ్యూల్ చేసుకోవచ్చు!

**వాట్సాప్‌లో కొత్త ఫీచర్..**

**మెసేజ్‌లను 14 రోజుల ముందుగానే షెడ్యూల్ చేసుకునే ఛాన్స్**

**టెక్స్ట్, లింకులు, ఫొటోలు, వీడియోలు పంపేందుకు అవకాశం**

**సెండ్ బటన్‌ను నొక్కి తేదీ, సమయం ఎంచుకునే ఆప్షన్**

**పంపేలోపు మెసేజ్‌ను మార్చడం లేదా తొలగించే అవకాశం**

**ప్రస్తుతానికి ఆండ్రాయిడ్ బీటా వినియోగదారులకు అందుబాటులోకి**

**అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):**
వాట్సాప్ వినియోగదారులకు త్వరలో కొత్త ఫీచర్ అందుబాటులోకి రానుంది. ఇకపై మెసేజ్‌లను ముందుగానే సిద్ధం చేసి, మనకు కావాల్సిన సమయానికి ఆటోమేటిక్‌గా పంపించే అవకాశం కలగనుంది. ప్రస్తుతం ఈ ఫీచర్‌ను కొందరు




ఆండ్రాయిడ్ బీటా వినియోగదారులపై పరీక్షిస్తున్నారు. ఈ ఫీచర్‌తో టెక్స్ట్ మెసేజ్‌లు, లింకులు, ఫొటోలు, వీడియోలను 14 రోజుల ముందుగానే షెడ్యూల్ చేసుకోవచ్చు. ఉదాహరణకు.. పుట్టినరోజు శుభాకాంక్షలు అర్ధరాత్రి 12 గంటలకు పంపాలనుకుంటే ముందుగానే మెసేజ్ సిద్ధం చేసుకోవచ్చు. నిర్ణయించిన సమయానికి వాట్సాప్ ఆటోమేటిక్‌గా పంపిస్తుంది.

**ఎలా షెడ్యూల్ చేయాలి?**

ముందుగా చాట్‌లో మెసేజ్ టైప్ చేయాలి. ఫొటో లేదా వీడియోను కూడా జత చేయవచ్చు. ఆ తర్వాత సెండ్ బటన్‌ను కొద్దిసేపు నొక్కి ఉంచాలి. అప్పుడు తేదీ, సమయం ఎంచుకునే ఆప్షన్ కనిపిస్తుంది. వాటిని ఎంపిక చేసి షెడ్యూల్ చేయవచ్చు. ఒక మెసేజ్‌కు ప్రస్తుతం ఒక ఫొటో లేదా వీడియో మాత్రమే జత చేయగలరు. షెడ్యూల్ చేసిన మెసేజ్‌ను పంపేలోపు మార్చుకోవచ్చు. అవసరం లేకపోతే తొలగించవచ్చు కూడా. తొలగించిన విషయాన్ని అవతలి వ్యక్తి గుర్తించలేరు. గ్రూపుల్లో మెసేజ్ షెడ్యూల్ చేసిన సమయంలో సభ్యులుగా ఉన్నవారికే అది చేరుతుంది. ఆ తర్వాత గ్రూపులో చేరినవారికి ఆ మెసేజ్ అందదు. ఈ మెసేజ్‌లకు కూడా ఎండ్–టు–ఎండ్ ఎన్‌క్రిప్షన్ రక్షణ ఉంటుంది. అయితే, ఈ ఫీచర్ ఇంకా పరీక్షల దశలోనే ఉంది. అందరికీ ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తుందో వాట్సాప్ ఇంకా ప్రకటించలేదు.

# డాలర్‌పై రూపాయి జోరు..

## వరుసగా రెండో రోజూ బలోపేతం



**అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):**
అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ వరుసగా రెండో రోజూ భారీగా బలపడింది. మంగళవారం ఉదయం ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ఏకంగా 77 పైసలు లాభపడి 95.05 వద్ద ట్రేడ్ అవుతోంది. డాలర్ డిమాండ్‌ను తగ్గించడం, స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌ను అరికట్టడం లక్ష్యంగా ఆర్బీఐ తీసుకున్న కఠిన చర్యలు రూపాయికి అండగా నిలిచాయి. సోమవారం కూడా రూపాయి 93 పైసలు లాభపడి 95.78 వద్ద ముగిసిన విషయం తెలిసిందే. ఆరు నెలల్లో ఒక్కరోజులో ఇంతటి వృద్ధిని నమోదు చేయడం ఇదే తొలిసారి. ఆర్బీఐ తాజాగా తీసుకున్న చర్యల్లో భాగంగా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల కోసం ప్రత్యేక డాలర్ విండోను ఏర్పాటు చేసింది. దీంతో స్పాట్ మార్కెట్లో డాలర్లకు డిమాండ్ తగ్గుతుందని భావిస్తున్నారు. అంతేగాక కొన్ని ఫారెక్స్ హెడ్జింగ్ లావాదేవీలపై వ్యయాన్ని పెంచడం ద్వారా స్పెక్యులేషన్‌కు అడ్డుకట్ట వేసింది. ఇటీవల రద్దు చేసిన ఫారెక్స్ డెరివేటివ్ కాంట్రాక్టులను మళ్లీ రీబుక్ చేయడానికి వీల్లేదని కూడా ఆర్బీఐ స్పష్టం చేసింది. మరోవైపు అంతర్జాతీయంగా ఆరు ప్రధాన కరెన్సీలతో డాలర్ బలాన్ని సూచించే డాలర్ ఇండెక్స్ 0.15% తగ్గి 102.43 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ ముడిచమురు ధరలు కూడా తగ్గడం రూపాయికి సానుకూలంగా మారింది. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 1% పైగా తగ్గి 105.47 డాలర్ల వద్ద ఉంది. 2026 చివరి నాటికి డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.60 నుంచి 97.50 మధ్య కదలాడవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# సింహాలతో సీతక్క.. దక్షిణాఫ్రికాలో సఫారీ వీడియో వైరల్

**అక్టోబర్ 13 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ మంత్రి సీతక్క ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. ఆమె దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా సింహాల సఫారీకి వెళ్లగా, అక్కడ సింహాల వెంటే ఎంతో ధైర్యంగా నడుస్తున్న వీడియో ఒకటి ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఆమె సాహసాన్ని చూసి నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.
మంత్రి సీతక్క ఇటీవల దక్షిణాఫ్రికాలో పర్యటించారు. అక్కడి తెలంగాణ సంఘం ఆహ్వానం మేరకు బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేందుకు ఆమె వెళ్లారు. దీంతో పాటు, ఎల్ నినో ప్రభావంతో తెలంగాణ రైతులు ఎదుర్కొంటున్న నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని, తక్కువ నీటితో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అధ్యయనం చేయడానికి కూడా ఈ పర్యటనను ఉపయోగించుకున్నారు.
తన అధికారిక పర్యటనలో భాగంగా ఆమె ఓ లయన్ సఫారీని



సందర్శించారు. ఈ సందర్భంగా కొన్ని సింహాలు వారు ప్రయాణిస్తున్న వాహనం వద్దకు రావడం, ఆ తర్వాత సీతక్క చేతిలో ఓ కర్ర పట్టుకుని రెండు సింహాల వెనుక ఎంతో ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో నడుస్తూ కనిపించడం వంటి దృశ్యాలు ఈ వీడియోలో ఉన్నాయి. ఈ క్లిప్‌ను ఆమె తన సోషల్ మీడియాలో పంచుకోవడంతో అది మరింత వేగంగా వ్యాపించింది. ఈ వీడియో చూసిన నెటిజన్లు మంత్రి సీతక్క ధైర్యాన్ని కొనియాడుతున్నారు. ఆమె ఆదివాసీ నేపథ్యం, రాజకీయాల్లోకి రాకముందు నక్సలైట్ ఉద్యమంలో పనిచేసిన గతం వంటి అంశాలను గుర్తుచేసుకుంటూ, ఆ ధైర్యమే ఇక్కడ కనిపిస్తోందని కామెంట్లు పెడుతున్నారు. ఒకప్పుడు అడవుల్లో పోరాడిన ఆమె, ఇప్పుడు సింహాల మధ్య కూడా అంతే ధైర్యంగా నడవడంలో ఆశ్చర్యం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఉన్నత చదువులు (పీహెచ్‌డీ, లా) చదివి, ప్రజా జీవితంలోకి వచ్చిన ఆమె ప్రస్థానాన్ని అభినందిస్తున్నారు.

# క్రికెట్‌లో విషాదం.. జింబాబ్వే మాజీ క్రికెటర్ కన్నుమూత

### - 36 ఏళ్లకే తుదిశ్వాస.. క్రీడాకారిణిగా, అంపైర్‌గా ప్రత్యేక గుర్తింపు




**హరారే:** జింబాబ్వే క్రికెట్ రంగంలో విషాదం చోటుచేసుకుంది. ఆ దేశ మాజీ మహిళా క్రికెటర్, అంతర్జాతీయ అంపైర్ సారా డంబానేవానా (36) కన్నుమూశారు. ఆమె మరణవార్తతో జింబాబ్వే క్రికెట్ వర్గాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆటగానిగా దేశానికి ప్రాతినిధ్యం వహించడంతో పాటు, అనంతరం అంపైర్‌గా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఆమె సేవలను క్రికెట్ వర్గాలు గుర్తుచేసుకుంటున్నాయి.సారా డంబానేవానా 2009 నుంచి 2014 వరకు జింబాబ్వే మహిళల జట్టు తరఫున క్రికెట్ ఆడారు. వేగవంతమైన బౌలర్‌గా జట్టుకు సేవలందించారు. 2011లో జరిగిన మహిళల ప్రపంచకప్ అర్హత పోటీల్లోనూ దేశానికి ప్రాతినిధ్యం వహించారు. ఆటగానిగా తన ప్రతిభను చాటుకున్న ఆమె, క్రికెట్‌పై ఉన్న ఆసక్తితో అంపైరింగ్ రంగంలోకి అడుగుపెట్టారు. క్రమంగా తన నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు.2022లో అంతర్జాతీయ క్రికెట్ మండలి అభివృద్ధి అంపైర్ల జాబితాలో చోటు సంపాదించిన తొలి జింబాబ్వే మహిళగా ఆమె గుర్తింపు పొందారు. 2023లో అంతర్జాతీయ మ్యాచ్‌లకు అంపైర్‌గా వ్యవహరించడం ప్రారంభించారు. అదే ఏడాది దక్షిణాఫ్రికాలో జరిగిన అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌కు అంపైర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రపంచకప్ ఫైనల్‌కు అంపైర్‌గా వ్యవహరించిన తొలి జింబాబ్వే మహిళగా చరిత్ర సృష్టించారు.అక్కడితో ఆగకుండా తన ప్రస్థానాన్ని కొనసాగించిన సారా, 2024 మహిళల టీ20 ప్రపంచకప్, 2025 మహిళల వన్డే ప్రపంచకప్ పోటీల్లోనూ అంపైర్‌గా విధులు నిర్వర్తించారు. పురుషుల, మహిళల అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లకు కూడా అంపైరింగ్ చేశారు. మొత్తం 72 సీనియర్ అంతర్జాతీయ మ్యాచ్‌లకు అంపైర్‌గా వ్యవహరించి తన ప్రతిభను నిరూపించుకున్నారు.మార్చిలో వైద్య ప్రక్రియ అనంతరం ఆసుపత్రిలో చేరిన ఆమె చికిత్స పొందుతూ అక్టోబర్ 12న మరణించినట్లు సమాచారం. ఆమె మృతి పట్ల అంతర్జాతీయ క్రికెట్ మండలి, జింబాబ్వే క్రికెట్ వర్గాలు సంతాపం వ్యక్తం చేశాయి. క్రీడాకారిణిగా ప్రారంభమైన ఆమె ప్రయాణం అంతర్జాతీయ అంపైర్ స్థాయికి చేరడం ఎంతోమంది యువతులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నాయి.చిన్న వయసులోనే సారా డంబానేవానా మరణించడం జింబాబ్వే క్రికెట్‌కు తీరని లోటు. మైదానంలో ఆటగానిగా, అనంతరం అంపైర్‌గా ఆమె అందించిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోనున్నాయి.

# ఆస్ట్రేలియా పర్యటనకు ఇంగ్లండ్ జట్లు ప్రకటన

### హ్యారీ బ్రూక్ నాయకత్వంలో వన్డే, టీ20 జట్లు సిద్ధం.. యువ ఆటగాళ్లకు పెద్దపీట

**లండన్:** ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా జరిగే వన్డే, టీ20 అంతర్జాతీయ క్రికెట్ సిరీస్‌ల కోసం ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు జట్లను ప్రకటించింది. ఈ పర్యటనకు హ్యారీ బ్రూక్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేస్తూ రెండు ఫార్మాట్లలోనూ జట్టుకు నాయకత్వ బాధ్యతలు అప్పగించింది. ఆస్ట్రేలియా గడ్డపై జరిగే ఈ సిరీస్‌లను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఇంగ్లండ్ జట్టు, అనుభవజ్ఞులతో పాటు ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లకు కూడా అవకాశాలు కల్పించింది. జట్టు ఎంపికలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు, ఆస్ట్రేలియాను వారి సొంత గడ్డపైనే ఎదుర్కొనేందుకు పటిష్ఠమైన కూర్పుపై దృష్టి సారించింది.వన్డే, టీ20 ఫార్మాట్లకు 16 మంది చొప్పున ఆటగాళ్లను ఎంపిక చేసినట్లు ప్రకటించింది. జోఫ్రా ఆర్చర్ వన్డే జట్టులో తిరిగి చోటు దక్కించుకోవడం విశేషం. అలాగే, గాయం నుంచి కోలుకుంటున్న జాకబ్ బెథెల్‌కు రెండు ఫార్మాట్లలోనూ అవకాశం కల్పించారు. మరోవైపు, టీ20 జట్టులో యువ ఆటగాళ్లు థామస్ రే, ఎడీ జాక్ తొలిసారి స్థానం సంపాదించారు. ఈ ఎంపిక ద్వారా యువ ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు, అంతర్జాతీయ స్థాయిలో వారికి తమ సత్తా చాటుకునే అవకాశం కల్పించినట్లయింది.అయితే, ఇంగ్లండ్ జట్టుకు జోస్ బట్లర్ అందుబాటులో లేకపోవడం కొంత లోటుగా మారనుంది. తొడ కండరాల గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్న బట్లర్ ఈ పర్యటనకు దూరమయ్యాడు. అతడి గైర్హాజరీలో జట్టు సమతూకాన్ని కాపాడటం, బ్యాటింగ్ విభాగాన్ని బలోపేతం చేయడం జట్టు యాజమాన్యానికి కీలకంగా మారనుంది. హ్యారీ బ్రూక్ నాయకత్వంలో ఆటగాళ్లు సమష్టిగా రాణిస్తే ఆస్ట్రేలియాపై మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని క్రికెట్ అభిమానులు భావిస్తున్నారు.ఈ పర్యటనలో భాగంగా నవంబర్ 13న పెర్త్ వేదికగా తొలి వన్డే జరగనుంది. నవంబర్ 15న అడిలైడ్‌లో రెండో వన్డే, నవంబర్ 18న హోబార్ట్‌లో మూడో వన్డే నిర్వహించనున్నారు. మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ముగిసిన అనంతరం ఇరు జట్లు టీ20 పోరుకు సిద్ధం కానున్నాయి. నవంబర్ 21న తొలి టీ20 మ్యాచ్‌తో ఐదు మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభమవుతుంది. నవంబర్ 23, 26, 28 తేదీల్లో తదుపరి మ్యాచ్‌లు జరగనుండగా, డిసెంబర్ 2న కాన్‌బెర్రాలో జరిగే చివరి టీ20తో ఇంగ్లండ్ పర్యటన ముగియనుంది.ఆస్ట్రేలియా సొంత మైదానాల్లో ఆ జట్టును ఎదుర్కోవడం ఇంగ్లండ్‌కు సవాలుతో కూడుకున్నదే. అక్కడి పిచ్‌లు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆడటం, ప్రత్యర్థి బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కోవడం, కీలక సమయాల్లో వికెట్లు కాపాడుకోవడం జట్టు విజయావకాశాలను నిర్ణయించనున్నాయి. ముఖ్యంగా యువ ఆటగాళ్లు ఒత్తిడిని అధిగమించి రాణిస్తే ఇంగ్లండ్‌కు అదనపు బలం చేకూరనుంది. బౌలింగ్‌లో జోఫ్రా ఆర్చర్ వంటి ఆటగాళ్ల ప్రదర్శన కూడా కీలకం కానుంది.మొత్తంగా, ఆస్ట్రేలియా పర్యటన కోసం ఇంగ్లండ్ ప్రకటించిన జట్లు క్రికెట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. హ్యారీ బ్రూక్ నాయకత్వంలో ఇంగ్లండ్ జట్టు వన్డే, టీ20 సిరీస్‌లలో ఎలా రాణిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు, స్వదేశంలో బలంగా ఉండే ఆస్ట్రేలియాను ఇంగ్లండ్ ఏ మేరకు నిలువరిస్తుందో చూడాలి. రెండు జట్ల మధ్య జరిగే ఈ పోటీ హోరాహోరీగా సాగుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.




# ప్రపంచకప్ టికెట్లకు భారీ డిమాండ్

### కేవలం 12 రోజుల్లోనే 1.5 కోట్ల దరఖాస్తులు.. 142 దేశాల నుంచి క్రికెట్ అభిమానుల ఆసక్తి



**దుబాయ్:** ప్రపంచ క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 2027 పురుషుల వన్డే ప్రపంచకప్ టికెట్లకు భారీ స్పందన లభిస్తోంది. టికెట్ల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైన కేవలం 12 రోజుల్లోనే ఏకంగా 1.5 కోట్లకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా 142 దేశాలకు చెందిన అభిమానులు టికెట్ల కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ విషయాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి అక్టోబర్ 13న వెల్లడించింది. ప్రపంచకప్‌పై అభిమానుల్లో ఉన్న ఆసక్తికి ఈ స్పందన నిదర్శనంగా నిలుస్తోంది.ప్రపంచకప్ టికెట్ల కోసం ఇప్పటివరకు 44,23,417 నమోదు ప్రక్రియలు పూర్తయ్యాయని, వాటి ద్వారా మొత్తం 1,50,83,752 టికెట్ల కోసం దరఖాస్తులు అందాయని అంతర్జాతీయ క్రికెట్ మండలి తెలిపింది. టికెట్ల దరఖాస్తుల సంఖ్య వేగంగా పెరుగుతుండటం విశేషం. గత వారం నాటికి సుమారు 10 లక్షలుగా ఉన్న దరఖాస్తులు, కొద్ది రోజుల వ్యవధిలోనే కోటిన్నరకు చేరడం క్రికెట్ ప్రపంచంలో ఈ మెగా టోర్నీకి ఉన్న ఆదరణను తెలియజేస్తోంది.టికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్న దేశాల్లో ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, భారత్, అమెరికా, ఆస్ట్రేలియా దేశాల అభిమానులు ముందంజలో ఉన్నారు. ముఖ్యంగా భారత్‌లో క్రికెట్‌కు ఉన్న అపారమైన ఆదరణ నేపథ్యంలో భారత అభిమానుల నుంచి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయి. ప్రపంచంలోని ప్రముఖ జట్లు పాల్గొనే ఈ టోర్నీలో తమ అభిమాన ఆటగాళ్లను ప్రత్యక్షంగా వీక్షించేందుకు క్రికెట్ ప్రేమికులు ఆసక్తి చూపుతున్నారు.2027 ప్రపంచకప్ అక్టోబర్ 2 నుంచి నవంబర్ 21 వరకు జరగనుంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఈ పోటీలకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. దాదాపు 24 ఏళ్ల విరామం తర్వాత వన్డే ప్రపంచకప్ ఆఫ్రికా ఖండానికి తిరిగి వస్తుండటంతో ఈసారి పోటీలపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది.

వివిధ దేశాల నుంచి అభిమానులు తరలివచ్చే అవకాశం ఉండట ంతో ఆతిథ్య దేశాల్లోనూ ఏర్పాట్లపై దృష్టి సారిస్తు న్నారు. టికెట్ల కోసం దరఖాస్తు చేసుకునే గడువు నవంబర్ 21, 2026 వరకు కొనసాగనుంది. దరఖాస్తు సమయంలో ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని నిర్వాహకులు స్పష్టం చేశారు. టికెట్లకు డిమాండ్ అందుబాటులో ఉన్న సంఖ్యను మించితే, లాటరీ పద్ధతిలో టికెట్లు కొనుగోలు చేసుకునే అవకాశం కల్పిస్తారు.

దరఖాస్తు చేసుకున్నంత మాత్రాన టికెట్ ఖరారైనట్లు కాదని, ఎంపికైన వారికి తదుపరి కొనుగోలు వివరాలను ఇ-మెయిల్ ద్వారా తెలియజేస్తామని అంతర్జాతీయ క్రికెట్ మండలి వెల్లడించింది.ప్రపంచకప్‌కు ఇంకా ఏడాది సమయం ఉన్నప్పటికీ టికెట్ల కోసం ఇంత భారీ స్థాయిలో దరఖాస్తులు రావడం నిర్వాహకులకు ఉత్సాహాన్నిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులను ఒక్కచోట చేర్చే ఈ మెగా టోర్నీ కోసం ఇప్పటి నుంచే ఆసక్తి పెరుగుతుండటంతో, 2027 ప్రపంచకప్ క్రికెట్ చరిత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

# ఐసీసీ పురస్కారాల్లో భారత క్రికెటర్ల జోరు

### ● ఐదోసారి శుభ్‌మన్ గిల్‌కు నెలవారీ అవార్డు.. రెండోసారి షఫాలీ వర్మకు పురస్కారం




**దుబాయ్:** అంతర్జాతీయ క్రికెట్‌లో భారత ఆటగాళ్లు మరోసారి తమ సత్తా చాటారు. సెప్టెంబర్ నెలకు సంబంధించిన అంతర్జాతీయ క్రికెట్ మండలి పురుషుల, మహిళల ఉత్తమ ఆటగాళ్ల పురస్కారాలను భారత క్రికెటర్లు శుభ్‌మన్ గిల్, షఫాలీ వర్మ దక్కించుకున్నారు. గిల్ తన కెరీర్‌లో ఐదోసారి ఈ పురస్కారాన్ని అందుకోగా, షఫాలీ వర్మ రెండోసారి ఈ గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. ఒకే నెలలో పురుషుల, మహిళల విభాగాల్లోనూ భారత ఆటగాళ్లే విజేతలుగా నిలవడం విశేషం. ఈ విషయాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి అక్టోబర్ 13న ప్రకటించింది.**గిల్ అద్భుత బ్యాటింగ్ ప్రదర్శన**భారత వన్డే జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో అద్భుతంగా రాణించారు. తొలి రెండు వన్డేల్లోనే 333 పరుగులు సాధించి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించారు. తొలి వన్డేలో 110 పరుగులు చేసిన గిల్, రెండో వన్డేలో అజేయంగా 223 పరుగులతో చెలరేగారు. ఈ ఇన్నింగ్స్‌లో 26 ఫోర్లు, ఎనిమిది సిక్సర్లు బాదారు. లక్ష్య ఛేదనలో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఆటగాడిగా నిలవడంతో పాటు, వన్డేల్లో అత్యంత వేగంగా ద్విశతకం పూర్తి చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించారు.గిల్ ప్రదర్శనతో వెస్టిండీస్‌తో తొలి రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్ విజయం సాధించింది. ఈ అద్భుత ప్రదర్శనకు గుర్తింపుగా సెప్టెంబర్ నెల పురుషుల ఉత్తమ ఆటగాడి పురస్కారం ఆయనకు లభించింది. గతంలో 2023 జనవరి, 2023 సెప్టెంబర్, 2025 ఫిబ్రవరి, 2025 జూలై నెలల్లోనూ ఈ అవార్డును గెలుచుకున్న గిల్, తాజాగా ఐదోసారి పురస్కారాన్ని అందుకుని కొత్త రికార్డు నెలకొల్పారు. ఈ విభాగంలో అత్యధికసార్లు అవార్డు గెలుచుకున్న ఆటగాడిగా తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకున్నారు.**షఫాలీ వర్మకు రెండోసారి గౌరవం**భారత మహిళా జట్టు ఓపెనర్ షఫాలీ వర్మ కూడా తన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నారు. ఆసియా కప్, ఆసియా క్రీడల్లో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఆమెకు మహిళల విభాగంలో సెప్టెంబర్ నెల ఉత్తమ ఆటగాడి పురస్కారం లభించింది. ఆసియా కప్‌లో ఐదు ఇన్నింగ్స్‌ల్లో 236 పరుగులు చేసి అత్యధిక పరుగులు సాధించిన క్రీడాకారిణిగా నిలిచారు. కీలకమైన సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌ల్లోనూ పరుగులు సాధించి భారత జట్టు విజయానికి దోహదపడ్డారు.ఆసియా క్రీడల్లోనూ షఫాలీ తన దూకుడును కొనసాగించారు. మూడు ఇన్నింగ్స్‌ల్లో 188 పరుగులు సాధించారు. బంగ్లాదేశ్‌తో జరిగిన సెమీఫైనల్‌లో కేవలం 49 బంతుల్లోనే 100 పరుగులు చేసి తన తొలి అంతర్జాతీయ టీ20 శతకాన్ని నమోదు చేశారు. బ్యాటింగ్‌తో పాటు బంతితోనూ రాణించిన ఆమె, ఆసియా కప్, ఆసియా క్రీడల్లో భారత్ విజయాల్లో కీలక పాత్ర పోషించారు.

# గెలుపు బాటలో హైదరాబాద్

**హైదరాబాద్:** త్రిపురతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్‌బి మ్యాచ్‌లో హైదరాబాద్ గెలుపు బాటలో ప్రయాణిస్తోంది. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 294 పరుగులకు ఆలౌటైంది. దీంతో జట్టుకు కీలకమైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. త్రిపుర మొదటి ఇన్నింగ్స్‌లో 134 పరుగులకే కుప్పకూలిన సంగతి తెలిసిందే. కాగా, సోమవారం రెండో రోజు హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో మెరుగైన ప్రదర్శన చేసింది. రుథిక్ యాదవ్ 150 బంతుల్లో ఐదు ఫోర్లతో 61 పరుగులు చేశాడు. రాహుల్ రాదేశ్ (40), చామ మిలింద్ (40),




అనికేత్ రెడ్డి (20) పరుగులు చేయడంతో హైదరాబాద్ కీలకమైన ఆధిక్యాన్ని సొంతం చేసుకుంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ చేపట్టిన త్రిపురను హైదరాబాద్ బౌలర్లు హడలెత్తించారు. అద్భుత బౌలింగ్‌తో త్రిపుర బ్యాట్స్‌మెన్‌ను పెవిలియన్ బాట పట్టించారు. తనయ్ త్యాగరాజన్ 3, కెప్టెన్ సిరాజ్ రెండు వికెట్లు తీశారు. సోమవారం ఆట ముగిసే సమయానికి త్రిపు 35 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే మరో 54 పరుగులు చేయాలి. ప్రస్తుతం జింఖానా పిచ్ బౌలిం గ్‌కు అనుకూలంగా మారడంతో త్రిపురకు ఓటమి తప్పించు కోవడం దాదాపు అసాధ్యమేనని చెప్పాలి.

## రణ్‌బీర్ 'రామాయణ' నుంచి జటాయువు పోస్టర్

రణ్‌బీర్ కపూర్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ: పార్ట్-1' నుంచి మరో ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో 'జటాయువు' పాత్రకు సంబంధించిన తొలి పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ప్రముఖ నటుడు అనుపమ్ ఖేర్ ఈ పాత్రకు తన గొంతును అందించనున్నారు. 'ది వింగ్స్ ఆఫ్ ధర్మ' (ధర్మ రెక్కలు) పేరుతో విడుదలైన పోస్టర్‌లో జటాయువు తీక్షణమైన చూపులు ఆకట్టుకుంటున్నాయి. మరో దృశ్యంలో ఆ భారీ పక్షి రెక్కలు విప్పి కనిపిస్తోంది.




ఈ పోస్టర్‌ను సోషల్ మీడియాలో పంచుకున్న చిత్రబృందం.. రావణుడు సీతను అపహరించినప్పుడు అతడిని ఎదిరించేందుకు జటాయువు చూపిన ధైర్యాన్ని గుర్తుచేసింది. విజయం కోసం కాకుండా ధర్మం కోసం పోరాడిన వీరుడిగా జటాయువును అభివర్ణించింది. సినిమా ప్రచారంలో భాగంగా ఇప్పటికే పలు పాత్రల పోస్టర్లను విడుదల చేయగా.. తాజాగా జటాయువు పోస్టర్‌ను పరిచయం చేసింది.నితేశ్ తివారీ దర్శకత్వంలో రెండు భాగాలుగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవిదూబే నటిస్తున్నారు. నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్.. డీఎన్ఈజీ, యశ్ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.'రామాయణం' తొలి భాగాన్ని 2026 నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్రబృందం నిర్ణయించింది. రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ సినిమా విడుదల కానుంది.ఇటీవల ముంబైలో నిర్వహించిన ప్రచార కార్యక్రమానికి అంతర్జాతీయ యూట్యూబర్ మిస్టర్ బీస్ట్ హాజరయ్యారు. రణ్‌బీర్, సాయిపల్లవి, నిర్మాత నమిత్ మల్హోత్రా కూడా పాల్గొన్నారు. అయితే కార్యక్రమం సుమారు నాలుగు గంటలు ఆలస్యంగా ప్రారంభం కావడంతో మీడియా ప్రతినిధుల నుంచి విమర్శలు వచ్చాయి.ఇదిలా ఉండగా, శ్రీరాముడి పాత్ర కోసం రణ్‌బీర్ మాంసాహారం, మద్యానికి దూరంగా ఉన్నారంటూ వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ మార్పులన్నీ ప్రత్యేకంగా సినిమా కోసమే చేశారనే విషయంపై స్పష్టత లేదు. ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకునే ప్రయత్నంలో భాగంగా శాకాహారాన్ని స్వీకరించడం, మద్యం, ధూమపానాన్ని మానేయడం గురించి రణ్‌బీర్ గతంలో మాట్లాడారు.

# శ్రీవారి సన్నిధిలో 'రణబాలి' జంట.

## విజయ్, రష్మిక ప్రత్యేక పూజలు



టాలీవుడ్ క్రేజీ పెయిర్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా తమ కొత్త చిత్రం 'రణబాలి' విడుదల సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున వీరిద్దరూ స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఈరోజు సాయంత్రం హైదరాబాద్‌లో 'రణబాలి' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ జరగనుండగా, దానికి ముందు స్వామివారి ఆశీస్సులు తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.
సంప్రదాయ దుస్తుల్లో ఆలయానికి వచ్చిన విజయ్, రష్మిక ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దర్శనం అనంతరం వారు హైదరాబాద్‌కు తిరిగి రానున్నట్లు సమాచారం.'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత విజయ్-రష్మిక జంటగా నటిస్తున్న మూడో చిత్రం కావడంతో 'రణబాలి'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. ఇప్పటికే విడుదలైన పాటలు, ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఈ చిత్రం ఈ నెల 16న దసరా పండుగ కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాకు పలు ప్రత్యేకతలు ఉన్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం రాయలసీమ నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా దీనిని తెరకెక్కించింది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 'ది మమ్మీ' ఫేమ్, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ ఈ చిత్రంలో ప్రతినాయకుడి పాత్ర పోషించడం సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేస్తోంది. ప్రముఖ సంగీత ద్వయం అజయ్-అతుల్ ఈ చిత్రానికి స్వరాలు సమకూర్చారు.ప్రస్తుతం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచిన చిత్ర బృందం, ఈరోజు ప్రీ రిలీజ్ ఈవెంట్‌తో ప్రేక్షకుల్లోకి సినిమాను మరింతగా తీసుకెళ్లేందుకు సిద్ధమైంది. అయితే, దేశవ్యాప్తంగా సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. భారీ అంచనాల మధ్య థియేటర్లలోకి రానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

## యంగ్ బ్యూటీకి పాన్ ఇండియా జాక్ పాట్!



నాలుగేళ్ల క్రితం కన్నడ సినీపరిశ్రమ నుంచి అద్భుతమైన జానపద కథతో బ్లాక్ బస్టర్ సినిమా వచ్చింది. ఆ తర్వాత 2025లో వచ్చిన ప్రీక్వెల్ కూడా బంపర్ హిట్టు కొట్టి ఆ హీరో, నిర్మాణ సంస్థలకు గొప్ప ఆదాయం, అంతకుమించిన పేరును కూడా తెచ్చిపెట్టింది. కేజీఎఫ్ తర్వాత అదే స్థాయిలో వరుస పెట్టి పాన్ ఇండియా విజయాలు దక్కడంతో కన్నడ పరిశ్రమలో కొత్త జోష్ కూడా వచ్చింది. ఆ తర్వాత చాలా మంది వరుసగా పాన్ ఇండియా సినిమాలు ట్రై చేస్తూనే ఉన్నారు.
ఇదిలా ఉంటే పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ సంగతి ఎలా ఉన్నా.. ఆ ఫ్రాంఛైజీలో నటించిన హీరోకి, నిర్మాణ సంస్థకు మధ్య వివాదాలు సద్దుమణగలేదన్న చర్చ వేడెక్కించేస్తోంది. బాలీవుడ్ లో కరణ్ జోహార్- కార్తీక్ ఆర్యన్ ఇష్యూలా ఈ ఇష్యూ కూడా ఏదో ఒక రోజు సెటిలయ్యేదే. కానీ ఇప్పటికీ ఇంకా వారి మధ్య పొరపొచ్చాలు తగ్గలేదని గుసగుస వినిపిస్తోంది. బ్లాక్ బస్టర్ ప్రీక్వెల్ చాప్టర్ 1 విడుదలై ఇప్పటికి ఏడాది పూర్తి కాగా.. నిర్మాణ సంస్థ పేరును మెన్షన్ చేయకుండా హీరో, అలాగే హీరో పేరును ప్రస్థావించకుండా నిర్మాణ సంస్థ సోషల్ మీడియాల్లో వార్షికోత్సవ పోస్టును షేర్ చేయడంతో వారి మధ్య ఇంకా ఏదీ సెట్ రైట్ కాలేదని అర్థమైంది. అలాగే అదే చిత్రంలో నటించిన హీరోయిన్ కి, హీరోకి మధ్య కూడా కొన్ని విభేధాలొచ్చాయని.. వారి మధ్య కూడా మాటల్లేవనే ప్రచారం అప్పట్లో సాగింది. సరిగ్గా ఇదే కారణంతో తెలుగులో బ్లాక్ బస్టర్ ఫ్రాంఛైజీలో తన సరసన ఆ హీరోయిన్ నటించాల్సి ఉన్నా ఆ హీరో అవకాశం కల్పించలేదని గుసగుస వినిపిస్తోంది. ఇలాంటి సమయంలోనే వరుస హిట్లతో దూసుకుపోతున్న మమిత బైజుతో రీప్లేస్ చేసారని తెలుస్తోంది. ఇటీవల విశ్వనాథ్ అండ్ సన్స్, బెత్లహాం కుటుంబం చిత్రాలతో బంపర్ హిట్లు అందుకున్న ఈ యువనటి జాక్ పాట్ కొట్టినట్టేనన్న చర్చ సాగుతోంది. హీరోలతో సత్సంబంధాలు లేకపోతే అరుదైన అవకాశాలు ఛేజారుతాయనడానికి ఇది ఒక ఉదాహరణ. అయితే అదే సమయంలో మరో ప్రతిభావనికి ఆ అవకాశం దక్కింది. అయితే దీనిపై ఇంకా అధికారికంగా చిత్రబృందం ధృవీకరించాల్సి ఉంది. పాన్ ఇండియాలో బిగ్ ప్లానింగ్ తో తెరకెక్కుతున్న ఈ సీక్వెల్/ ప్రీక్వెల్ సినిమాకి సంబంధించిన అధికారిక అప్ డేట్స్ ఇకపై విడుదల కానున్నాయని సమాచారం

## డిసెంబర్ 4న ఆర్య 'హలో కాదల్' విడుదల..

### ఆసక్తి రేపుతున్న టీజర్




తమిళ నటుడు ఆర్య కథానాయకుడిగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'హలో కాదల్'. ఆర్య కెరీర్‌లో ఇది 40వ చిత్రం కావడం విశేషం. ఈ చిత్రంలో నిఖిలా విమల్, 'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య కథానాయికలుగా నటిస్తున్నారు. తాజాగా చిత్ర బృందం ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబర్ 4న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు.విడుదల తేదీ ప్రకటనతో పాటు మేకర్స్ ఒక ఆసక్తికరమైన టీజర్‌ను కూడా విడుదల చేశారు. ఈ టీజర్ ప్రస్తుతం ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది. విమానంలో నిఖిలా విమల్, వైష్ణవి చైతన్య సంభాషించుకుంటున్న దృశ్యంతో ఈ టీజర్ ప్రారంభమవుతుంది. వైష్ణవి తన ప్రేమకథ గురించి వివరిస్తుండగా, అందులో ఆర్య కనిపిస్తారు. అయితే, తన భర్తతో తనకున్న ప్రేమకథ అంతకంటే ఆసక్తికరంగా ఉంటుందని నిఖిల చెబుతుంది. ఆమె భర్త పాత్రలో కూడా ఆర్యనే కనిపించడంతో కథలో ఏదో వైవిధ్యమైన మలుపు ఉందని స్పష్టమవుతోంది.మలయాళంలో విజయవంతమైన 'ప్రణయ విలాసం' చిత్రానికి దర్శకత్వం వహించిన నిఖిల్ మురళి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని అందిస్తుండగా, జీవా శంకర్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ జూన్ నెలలోనే పూర్తికాగా, ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆర్య, సాయేషా తమ సొంత నిర్మాణ సంస్థ 'ది షో పీపుల్' బ్యానర్‌పై కిషోర్ టితో కలిసి ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



## ఊటీలో కీలక షెడ్యూల్ ప్రారంభం

విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, హిట్ మెషీన్ అనిల్ రావిపూడి సక్సెస్‌ఫుల్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న చిత్రం 'జనవరి 12 విడుదల'. ఈ సినిమా తాజా షెడ్యూల్‌ను చిత్ర బృందం ఊటీలో ప్రారంభించింది. సుందరమైన ప్రకృతి అందాల నడుమ ఈ షెడ్యూల్ జరగనుంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. వెంకటేష్ సరసన కీర్తి సురేష్, కల్యాణ్ రామ్ సరసన కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, కీర్తి సురేష్, కృతి శెట్టి, అజయ్ ఘోష్, ఉపేంద్ర లిమాయే సహా ప్రధాన తారాగణమంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారు. ఈ షెడ్యూల్‌లో రెండు అద్భుతమైన పాటలతో పాటు కథలో కీలకమైన పలు సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఊటీలోని ప్రకృతి అందాలు ఈ సన్నివేశాలకు మరింత ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, అనిల్ రావిపూడి విజయవంతమైన కాంబినేషన్‌లో వస్తున్న ఈ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.



## "ఆలోచనలు మారుతూ ఉంటాయి"..

### డేటింగ్ వ్యాఖ్యలపై శోభిత ధూళిపాళ్ల వివరణ!

నటుడితో డేటింగ్ చేయనని గతంలో చేసిన వ్యాఖ్యలపై నటి శోభిత ధూళిపాళ్ల స్పందించింది. అప్పట్లో తన ఆలోచనలు వేరుగా ఉండటంతో అలా చెప్పానని తెలిపింది. వయసు పెరిగే కొద్దీ ఆలోచనలు మారుతుంటాయని చెప్పింది. పరిస్థితులకు అనుగుణంగా అభిప్రాయాలు మార్చుకోవడంలో తప్పులేదని అభిప్రాయపడింది.
ప్రేమంటే కేవలం రొమాన్స్ మాత్రమే కాదని శోభిత పేర్కొంది. అది ఇద్దరి మనసుల కలయిక అని వివరించింది. ఎప్పుడూ ఒకేలా ఆలోచించడం కంటే మార్పును స్వీకరించడం ముఖ్యమని అభిప్రాయపడింది.వ్యక్తిగత జీవితంపై వచ్చే వార్తలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వకూడదని శోభిత సూచించింది. సమాజంలో అభిప్రాయాలు మారుతుంటాయని, వాటిని పట్టించుకుంటూ పోతే మనల్ని మనం కోల్పోయే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించింది. మన వ్యక్తిత్వంపై స్పష్టతతో ఉండాలని చెప్పింది. శోభిత, నాగచైతన్య 2024లో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే.